


Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS

irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 177 | మంగళవారం 16 డిసెంబర్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


# దేశ భద్రతకు ముప్పు

- అణుశక్తి రంగం ప్రయివేటీకరణ బిల్లుపై ప్రతిపక్షాల ఆగ్రహం
- ఉన్నత విద్యను నియంత్రించే బిల్లునూ వ్యతిరేకించిన విపక్షాలు
- జెపిసికి పంపాలని డిమాండ్.. దిగొచ్చిన కేంద్రం



# జోర్డాన్ చేరుకున్న మోదీ...

- 37 ఏళ్ల తర్వాత ఓ భారత ప్రధాని చరిత్రాత్మక పర్యటన!
- మూడు దేశాల పర్యటనలో భాగంగా జోర్డాన్ చేరుకున్న ప్రధాని మోదీ
- విమానాశ్రయంలో ప్రధానికి స్వయంగా స్వాగతం పలికిన జోర్డాన్ ప్రధాని
- ఇరు దేశాల దౌత్య సంబంధాలకు 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటన
- ఉగ్రవాద నిర్మూలన, వాణిజ్య సహకారంపై కీలక చర్చలు
- భారత్‌కు ఎరువుల సరఫరాలో జోర్డాన్ కీలక భాగస్వామి

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, డిసెంబర్ 15**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మూడు దేశాల విదేశీ పర్యటనను సోమవారం ప్రారంభించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన తొలి మజిలీగా జోర్డాన్‌లోని అమ్మాన్‌కు చేరుకున్నారు. విమానాశ్రయంలో జోర్డాన్ ప్రధాని జాఫర్ హసన్ స్వయంగా మోదీకి స్వాగతం పలికి ప్రత్యేక గౌరవం కల్పించారు. ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా జోర్డాన్ తర్వాత ఇథియోపియా, ఒమన్



దేశాలను సందర్శించనున్నారు. భారత్–జోర్డాన్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 ఏళ్లు పూర్తయి... ఈ

- మిగతా 2లో..

## బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా

# నితిన్ నబీన్ బాధ్యతలు స్వీకరణ

- బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబిన్ నియామకం
- నేడు ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘన స్వాగతం పలికిన అధిష్ఠానం
- మోదీ ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నడ్డా, అమిత్ షా సూచన
- ఈ పదవిని చేపట్టిన వారిలో అత్యంత పిన్న వయస్కుడిగా నిలిచిన నబిన్



**అమరావతి – సూర్య వాస్తవం, డిసెంబర్ 15**

బీజేపీ నూతన జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన నితిన్ నబిన్ సోమవారం ఢిల్లీలో లాంఛనంగా బాధ్యతలు స్వీకరించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయనకు బీజేపీ అధిష్ఠానం ఘన స్వాగతం పలికింది. పార్టీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా స్వయంగా

- మిగతా 2లో..

# ఏపీ ప్రాజెక్టులకు కేంద్రం అండ...

- మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో లోకేశ్ కీలక భేటీ
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మంత్రి నారా లోకేశ్ భేటీ
- రాష్ట్రవ్యాప్త నైపుణ్య గణనకు సహకరించాలని విజ్ఞప్తి
- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు మద్దతు కోరిన లోకేశ్
- ఏపీలో ఏఐ మిషన్ వేగవంతానికి సాయంపై కీలక చర్చ
- లోకేశ్ వినతులకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి



**అమరావతి – సూర్య వాస్తవం, డిసెంబర్ 15**

రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. కేంద్ర రైల్వే, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలో చేపట్టనున్న పలు కీలక ఐటీ, నైపుణ్యాభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు. లోకేశ్ విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో చేపట్టనున్న నైపుణ్య గణన

- మిగతా 2లో..



## ఇండిగో గందరగోళంపై పిల్...

- విచారణకు సుప్రీంకోర్టు నిరాకరణ
- ఇప్పటికే ఢిల్లీ హైకోర్టులో విచారణ జరుగుతోందని వెల్లడి
- పిటిషనర్‌ను హైకోర్టునే ఆశ్రయించాలని సూచించిన ధర్మాసనం - విమానాల రద్దుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని పిల్ - పరిస్థితి చక్కబడుతోందని ప్రకటించిన ఇండిగో యాజమాన్యం

2లో

## పొట్టిశ్రీరాములు యావత్

# తెలుగు ప్రజల ఆస్తి

- సీఎం చంద్రబాబు
- పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినాన్ని 'డే ఆఫ్ శాక్రిఫైస్'గా ప్రకటన
- అమరావతిలో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' నిర్మిస్తామన్న ముఖ్యమంత్రి
- గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అపహాస్యం చేసింది
- పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం పేరు 'వాసవీ పెనుగొండ'గా మార్పు
- పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలపై విపక్షాల విమర్శలను తిప్పికొట్టిన సీఎం

**అమరావతి – సూర్య వాస్తవం, డిసెంబర్ 15**

తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినాన్ని ఇకపై అధికారికంగా 'డే ఆఫ్ శాక్రిఫైస్' (త్యాగాల దినం)గా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఆయన త్యాగానికి గుర్తుగా రాజధాని అమరావతిలో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' నిర్మిస్తామని వెల్లడించారు. సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పొట్టిశ్రీరాములు కుటుంబ సభ్యు



లను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాటాడుతూ.. "బ్రిటిష్ వారిపై స్వాతంత్ర్యం కోసం, ఆ తర్వాత తెలుగు వారి ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయుడు పొట్టిశ్రీరాములు. పాలకుల వివక్షకు గురైన తెలుగు జాతికి ప్రత్యేక రాష్ట్రం కోసం 58 రోజుల పాటు

- మిగతా 2లో..



# "వైజాగ్‌కు వరల్డ్ ఛాంపియన్లు వస్తున్నారు"...

- మంత్రి నారా లోకేశ్ ఆసక్తికర సోషల్ మీడియా పోస్ట్
- ఈ నెలలో వైజాగ్‌కు ప్రపంచ ఛాంపియన్లు వస్తున్నారంటూ వెల్లడి
- ఎవరో ఊహించగలరా అంటూ నెటిజన్లకు సవాల్
- లోకేశ్ పోస్ట్‌తో సర్వత్రా ఉత్కంఠ, ఊహాగానాలు

**అమరావతి – సూర్య వాస్తవం, డిసెంబర్ 15**

ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్ట్ ఇప్పుడు సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన, త్వరలో విశాఖపట్నానికి ప్రపంచ ఛాంపియన్లు రాబోతున్నారని వెల్లడించారు. ఈ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా వైజాగ్ ప్రజల్లో తీవ్ర కుతూహలం నెలకొంది. "వైజాగ్... సిద్ధంగా ఉండు. ఈ నెలలోనే ప్రపంచ ఛాంపియన్లు వస్తున్నారు. వారెవరో ఎవరైనా ఊహించగలరా?" అంటూ లోకేశ్ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ చిన్న పోస్ట్ ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. వస్తున్నది క్రీడా రంగానికి చెందినవారా, లేక టెక్నాలజీ లేదా వ్యాపార రంగంలోని దిగ్గజాలా అనే దానిపై

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# ఏపీలో హార్ట్‌ఫుల్‌నెస్ విస్తరణ..

- దాజీతో సమాలోచనలు జరిపిన సీఎం చంద్రబాబు
- రంగారెడ్డి జిల్లా చేగూరులోని కన్హా శాంతి వనాన్ని సందర్శించిన చంద్రబాబు
- శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు దాజీతో ప్రత్యేకంగా సమావేశం
- ఏపీలో హార్ట్‌ఫుల్‌నెస్ కార్యాలయం ఏర్పాటుపై కీలక చర్చలు

2లో



# జోర్డాన్ చేరుకున్న మోదీ...

(మొదటిపేజీ తరువాయి)

చారిత్రక ప్రాధాన్యత సంతరించుకుంది. 37 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత ప్రధాని ఒకరు జోర్డాన్‌లో పూర్తిస్థాయి ద్వైపాక్షిక పర్యటన చేపట్టడం ఇదే తొలిసారి. తన రెండు రోజుల పర్యటనలో ప్రధాని మోదీ.. జోర్డాన్ రాజు అబ్దుల్లా ఇబ్న్ అల్ హుస్సేన్‌తో సమావేశమై ద్వైపాక్షిక, ప్రాంతీయ అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు. అలాగే, ప్రధాని జాఫర్ హసన్, యువరాజు అల్ హుస్సేన్ బిన్ అబ్దుల్లాతోనూ భేటీ కానున్నారు. ఉగ్రవాదంపై పోరాటంలో ఇరు దేశాలు పరస్పరం సహకరించుకుంటున్నాయి. ఇటీవల జరిగిన పహల్గాం ఉగ్రదాడిని జోర్డాన్ రాజు తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లో తిరస్కరించాలని స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు కూడా బలంగా ఉన్నాయి. జోర్డాన్‌కు భారత్ మూడో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి కాగా, ద్వైపాక్షిక వాణిజ్యం 2.8 బిలియన్ డాలర్లుగా ఉంది. ముఖ్యంగా, భారతదేశానికి అవసరమైన ఫాస్ఫేట్, పొటాష్ వంటి ఎరువుల సరఫరాలో జోర్డాన్ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ అక్కడి ప్రవాస భారతీయులతో కూడా సమావేశం కానున్నారు. జోర్డాన్‌లో సుమారు 17,500 మంది భారతీయులు వివిధ రంగాల్లో పనిచేస్తున్నారు. ఇటీవల అమ్మాన్-ముంబై మధ్య నేరుగా విమాన సర్వీసులు ప్రారంభం కావడం ఇరు దేశాల మధ్య రాకపోకలను సులభతరం చేసింది.

# బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా
# నితిన్ నబీన్ బాధ్యతలు స్వీకరణ

(మొదటిపేజీ తరువాయి)

నితిన్ నబిన్‌ను కార్యాలయంలోకి ఆహ్వానించి, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నడ్డా తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక సందేశాన్ని పోస్ట్ చేశారు. "బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబిన్‌కు హృదయపూర్వక అభినందనలు. మీ నాయకత్వంలో సంస్థ మరింతగా విస్తరిస్తుందని, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాలను, పార్టీ సిద్ధాంతాలను ప్రతి పౌరుడికి చేరువ చేస్తారని నేను విశ్వసిస్తున్నాను. మీ పదవీకాలం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను" అని నడ్డా పేర్కొన్నారు. అంతేకాకుండా, "గౌరవనీయులైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో, మీ సంస్థాగత నైపుణ్యాలు బీజేపీ ప్రజాసేవ, దేశ నిర్మాణ ప్రయాణానికి కొత్త దిశానిర్దేశం చేస్తాయి. బీజేపీ ప్రభుత్వ సంక్షేమ విధానాలను, పార్టీ సిద్ధాంతాలను మీరు మరింత సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలరు. మీ నూతన బాధ్యతలకు, విజయవంతమైన పదవీకాలానికి నా శుభాకాంక్షలు" అని జేపీ నడ్డా తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా నితిన్ నబిన్‌ను అభినందించారు. "బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన నితిన్ నబిన్‌కు అనేకానేక అభినందనలు. మీ నాయకత్వంలో సంస్థ మరింత పటిష్టమవుతుందని, నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాలు, పార్టీ సిద్ధాంతాలు ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా వెళతాయని నేను విశ్వసిస్తున్నాను. మీ పదవీకాలం విజయవంతం కావాలని కోరుకుంటున్నాను" అని అమిత్ షా అన్నారు. ఆదివారం బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన నితిన్ నబిన్, సోమవారం బాధ్యతలు స్వీకరించేందుకు న్యూఢిల్లీకి చేరుకున్నారు. ఈ పదవిని చేపట్టిన వారిలో ఆయనే అత్యంత పిన్న వయస్కుడు కావడం గమనార్హం. ఆయన వయసు 45 సంవత్సరాలు. సోమవారం ఉదయం ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా స్వాగతం పలికారు.

# ఇండిగో గందరగోళంపై పిల్...

**- విచారణకు సుప్రీంకోర్టు నిరాకరణ**
**- ఇప్పటికే ఢిల్లీ హైకోర్టులో విచారణ జరుగుతోందని వెల్లడి**
**- పిటిషనర్‌ను హైకోర్టునే ఆశ్రయించాలని సూచించిన ధర్మాసనం - విమానాల రద్దుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని పిల్ - పరిస్థితి చక్కబడుతోందని ప్రకటించిన ఇండిగో యాజమాన్యం**

**అమరావతి – సూర్య వాస్తవం, డిసెంబర్ 15**

ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో ఇటీవల నెలకొన్న తీవ్ర అంతరాయాలు, విమానాల రద్దుపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) విచారించేందుకు సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. ఈ అంశంపై ఇప్పటికే ఢిల్లీ హైకోర్టులో విచారణ జరుగుతున్నందున, అక్కడే తమ వాదనలు వినిపించాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిల్‌ను విచారించింది. న్యాయవాది నరేంద్ర మిశ్రా స్వయంగా ఈ పిల్‌ను దాఖలు చేశారు. ఇదే అంశంపై ఢిల్లీ హైకోర్టులో విచారణ కొనసాగుతోందని, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) కూడా ఓ కమిటీని ఏర్పాటు చేసిందని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, ఒకే అంశంపై రెండు చోట్ల సమాంతర విచారణలు అవసరం లేదని పేర్కొంది. పిటిషనర్ తన వాదనలను ఢిల్లీ హైకోర్టులో వినిపించేందుకు అనుమతించాలని ఉన్నత న్యాయస్థానాన్ని కోరింది. ఇటీవల ఇండిగో విమానాలు భారీ సంఖ్యలో రద్దు కావడం, ఆలస్యం అవ్వడంతో ప్రధాన విమానాశ్రయాల్లో 'మానవతా సంక్షోభం' తలెత్తిందని పిటిషనర్ తన పిల్‌లో ఆరోపించారు. వృద్ధులు, చిన్నారులతో సహా వేలాది మంది ప్రయాణికులు ఆహారం, నీళ్లు, సరైన వసతులు లేకుండా గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (జీవించే హక్కు)కు భంగం కలిగించడమేనని వాదించారు. మరోవైపు ఈ అంశంపై విచారణ జరుపుతున్న ఢిల్లీ హైకోర్టు, లక్షలాది మంది ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేసేలా పరిస్థితిని ఎందుకు దిగజార్చారని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఈ కేసు తదుపరి విచారణను జనవరి 22కి వాయిదా వేసింది. ఇదిలా ఉండగా.. తమ కార్యకలాపాలు క్రమంగా సాధారణ స్థితికి వస్తున్నాయని, ఈ నెల 12న 2,050 విమానాలు నడపగా కేవలం రెండు మాత్రమే రద్దయ్యాయని ఇండిగో ప్రకటించింది.

# "వైజాగ్‌కు వరల్డ్ ఛాంపియన్లు వస్తున్నారు"...

(మొదటిపేజీ తరువాయి)

ఊహాగానాలు మొదలయ్యాయి. సాధారణంగా ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల గురించి వెల్లడించే లోకేశ్, ఇలా సస్పెన్స్ క్రియేట్ చేస్తూ పోస్ట్ పెట్టడంతో అందరిలోనూ ఆసక్తి పెరిగింది. విశాఖను అంతర్జాతీయంగా మరింత ఉన్నత స్థాయిలో నిలబెట్టేందుకే ఈ కార్యక్రమం అని పలువురు భావిస్తున్నారు. ఆ ప్రపంచ ఛాంపియన్లు ఎవరు, వారు ఏ రంగంలో నిష్ణాతులు అనే వివరాలు తెలియాలంటే మంత్రి నుంచి రాబోయే అధికారిక ప్రకటన వరకు వేచి చూడాల్సిందే.

# దేశ భద్రతకు ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, డిసెంబర్ 15**

కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో రెండు కీలకమైన బిల్లులను ప్రవేశపెట్టింది. అందులో ఒకటి అణుశక్తి రంగం ప్రయివేటీకరణ బిల్లు, ఉన్నత విద్యను నియంత్రించే బిల్లు ఉన్నాయి. ఈ రెండు బిల్లులను ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దేశ భద్రతపై ఆందోళనను వ్యక్తం చేశాయి. అంతేకాకుండా విస్తృత పరిశీలన కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)కి పంపాలని డిమాండ్ చేశాయి. దీంతో ప్రభుత్వం దిగొచ్చింది. ఈ రెండు బిల్లులను జెపిసికి పంపింది. సోమవారం పార్లమెంట్ ఉభయ సభలు ప్రారంభం కాగానే గందరగోళం నడుమ నిమిషాల్లోనే వాయిదా పడ్డాయి. లోక్‌సభ రెండు సార్లు వాయిదా పడి, మధ్యాహ్నం రెండు గంటలకు తిరిగి ప్రారంభమైంది. కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ పౌర అణుశక్తి రంగాన్ని ప్రయివేటీకరించే, 'సస్టైనబుల్ హార్నెస్సింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా' బిల్లు (శాంతి బిల్లు)ను ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రవేశపెట్టడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దీన్ని సెలక్ట్ కమిటీకి లేదా జెపిసికి పంపాలని డిమాండ్ చేశాయి. దీంతో ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో ఈ బిల్లును జెపిసికి పంపింది. అనంతరం కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ యుజిసి, ఏఐసిటి, ఎన్‌సిటిఇ వంటి సంస్థలను రద్దు చేసి వాటి స్థానంలో ఒకే కమిషన్‌ను నియమించే వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ (విబిఎస్ఏ) బిల్లును ప్రవేశపెట్టారు. దీనిపై ప్రతిపక్షాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. కాంగ్రెస్ ఎంపి మనీశ్ తివారీ, టిఎంసి ఎంపి సౌగత రారు, సిపిఎం ఎంపి రాధాకృష్ణన్ వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ బిల్లును వ్యతిరేకించారు."వారు (పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ) బిల్లును అధ్యయనం చేయడానికి మాకు అవకాశం ఇవ్వాలి" అని డిమాండ్ చేశారు. దీంతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఈ బిల్లును జెపిసికి సూచించాలని ప్రతిపాదిస్తు న్నట్టు తెలిపారు. అలాగే కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ పాత చట్టాలను రద్దు చేయడం, లేదా వాటి స్థానంలో మార్పులు చేయడం కోసం రిపలింగ్ అండ్ అమెండింగ్ బిల్లును ప్రవేశపెట్టారు. కొత్త చట్టాలను తీసుకు రావడానికి, లేదా పాత చట్టాల్లోని అనవసరమైన, పాత నిబంధనలను తొలగించడానికి దీన్ని ఉపయోగిస్తారు.

**బిల్లులకు హిందీ పేర్లను పెట్టడాన్ని వ్యతిరేకించిన ప్రతిపక్ష ఎంపిలు**

విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లోక్‌సభలో వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ బిల్లును ప్రవేశపెట్టగా, కీలక చట్టాలకు హిందీ పేర్లను పెట్టడాన్ని ప్రతిపక్ష సభ్యులు వ్యతిరేకించారు. ఈ బిల్లును ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఆర్ఎస్‌పీ ఎంపీ ఎన్‌కె ప్రేమచంద్రన్ మాట్లాడారు. బిల్లులకు హిందీలో పేర్లు పెట్టడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 348(బి)ని ఉల్లంఘించడ మేనని వాదించారు. కాంగ్రెస్ సభ్యుడు జోతిమణి, డిఎంకె సభ్యుడు టి.ఎం సెల్వగణపతి, సిపిఎం ఎంపి కె.రాధాకృష్ణన్ కూడా బిల్లు పేరును వ్యతిరేకించారు. "దీనిని నేను హిందీని రుద్దడంగా చూస్తున్నాను. ఇప్పటికే, తమిళనాడు జాతీయ విద్యా విధానం-2020లో త్రిభాషా విధానాన్ని వ్యతిరేకించినందున ఎస్ఎస్ఏ నిధులను కోల్పోయింది" అని జోతిమణి అన్నారు. దక్షిణాది రాష్ట్రాలపై హిందీని రుద్దడానికి వ్యతిరేకంగా డిఎంకె ఎంపి టిఆర్ బాలు మాట్లాడారు.

**కార్మికులకు వ్యతిరేకం-రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం కేంద్రంపై సిపిఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ విమర్శలు**

ఉపాధి హామీ పథకం హామీ ఇచ్చిన హక్కులను తొలగించడంతో మోడీ ప్రభుత్వం ఈ పథకాన్ని కార్మికులు, రాష్ట్రాలకు వ్యతిరేకంగా మారుస్తోందని సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. సోమవారం రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ వేతనాలతో సహా కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిధులు సమకూర్చే ఈ పథకం ఆర్థిక భారంలో 40 శాతం రాష్ట్రాలు భరించాల్సి వస్తోందని అన్నారు. రాష్ట్రాలు రూ.50,000 కోట్లకు పైగా ఖర్చు చేయాల్సి ఉంటుందని వివరించారు. దీంతో ఒక్కో రాష్ట్రానికి దాదాపు రూ.2,000-రూ.2,500 కోట్ల అదనపు భారం పడుతోందని విమర్శించారు. కేంద్రం మోసంతో రాష్ట్రాలపై పథకం బాధ్యతను విధించడాన్ని అభివృద్ధి అని చెప్పలేమని అన్నారు. ఒక కార్మికుడు ఉద్యోగం అడిగితే, కేంద్ర ప్రభుత్వం దానిని అందించడానికి బాధ్యత వహిస్తుందని, ఇది ఉపాధి హామీ పథకం ప్రధాన ఆలోచన అని తెలిపారు. అయితే మోడీ ప్రభుత్వం కొత్త బిల్లుతో ఈ పథకం ఈ లక్ష్యాన్ని తారుమారు చేసిందని విమర్శించారు. ముందుగా నిర్ణయించిన షరతుల ఆధారంగా కేంద్రం పంపిణీ చేసే నిధుల చట్రంలోనే ఈ పథకాన్ని అమలు చేయాలని చెబుతున్నారని వివరించారు. నిధులు అయిపోయిన తరువాత ఈ పథకం కూడా రద్దు చేయబడుతుందనీ, ఉపాధి హామీ పథకం గతంలో గ్రామసభలు, పంచాయతీలపై ఆధారపడి ఉండేదని అన్నారు. అయితే, మోడీ ప్రభుత్వం ఈ వ్యవస్థను సరిదిద్దాలని, బయోమెట్రిక్స్, జియో-ట్యాగింగ్, ఏఐ ఆడిట్ మొదలైన వాటిపై ఆధారపడాలని ప్రతిపాదించిందని తెలిపారు. ఉపాధి హామీ చట్టంలోని సెక్షన్ 10 కింద ఏర్పాటు చేయబోయే కేంద్ర ఉపాధి హామీ మండలిలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, మైనారిటీలు, వెనుకబడిన తరగతులు, మహిళల ప్రాతినిధ్యం ఉండేలా నిబంధనలు ఉన్నాయనీ, అయితే, కొత్త బిల్లులో రిజర్వేషన్లకు సంబంధించిన నిబంధనలను కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని ఆయన చెప్పారు.

# ఏపీ ప్రాజెక్టులకు కేంద్రం అండ...

(మొదటిపేజీ తరువాయి)

కోసం ఏఐ టెక్నాలజీతో రూపొందించిన 'నైపుణ్యం పోర్టల్' గురించి లోకేశ్ కేంద్ర మంత్రికి వివరించారు. ఇప్పటికే మంగళగిరిలో పైలట్ ప్రాజెక్ట్ నిర్వహించామని, ఎదురైన సవాళ్లను అధిగమించేందుకు ఏఐ ఆధారిత ఇంటర్వ్యూ విధానాన్ని ప్రవేశపెట్టామని తెలిపారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టబోయే ఈ బృహత్ కార్యక్రమానికి కేంద్రం సహాయం అందించాలని కోరారు. అలాగే రాష్ట్రంలోని యువ పారిశ్రామికవేత్తల కోసం ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు కేంద్రం అండగా నిలవాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఐటీ శాఖ పరిధిలోని స్టార్టప్ హబ్' ద్వారా మద్దతు అందించాలని కోరారు. ఇదే హబ్‌లో యానిమేషన్, ఏఆర్/వీఆర్ వంటి అత్యాధునిక టెక్నాలజీస్ కోసం ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు కూడా సహకరించాలని విన్నవించారు. ఇండియా ఏఐ మిషన్‌లో భాగంగా రాష్ట్రంలో కృత్రిమ మేధ (ఏఐ) విస్తరణను వేగవంతం చేసేందుకు మద్దతివ్వాలని కోరారు. ఈ భేటీలో లోకేశ్ వెంట కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఇతర ఎంపీలు కూడా ఉన్నారు.

# ఏపీలో హార్ట్‌ఫుల్‌నెస్ విస్తరణ..




**అమరావతి – సూర్య వాస్తవం, డిసెంబర్ 15**



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రంగారెడ్డి జిల్లా చేగూరులోని ప్రఖ్యాత కన్హా శాంతి వనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ అధ్యక్షుడు కమలేశ్ డి పటేల్ (దాజీ) ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు, దాజీ ప్రత్యేకంగా సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ భేటీలో భాగంగా, ఆంధ్రప్రదేశ్‌లో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ కార్యాలయాన్ని ఏర్పాటు చేసే విషయంపై చంద్రబాబు దాజీతో సమాలోచనలు జరిపారు. కన్హా శాంతి వనంలో హార్ట్‌ఫుల్‌నెస్ చేపడుతున్న కార్యక్రమాల గురించి దాజీ సీఎంకు వివరించారు. ప్రకృతి పరిరక్షణ, పర్యావరణం, సుస్థిర వ్యవసాయం, ధ్యానం, యోగా శిక్షణ వంటి అంశాలపై జరుగుతున్న కృషిని ఆయన చంద్రబాబుకు తెలిపారు. శాంతి వనంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయానికి సమీపంలో 1400 ఎకరాల విస్తీర్ణంలో శ్రీరామచంద్ర మిషన్ ఈ శాంతి వనాన్ని అభివృద్ధి చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద మెడిటేషన్ సెంటర్‌గా ఇది గుర్తింపు పొందింది. 8 లక్షలకు పైగా వృక్ష జాతులతో జీవవైవిధ్య కేంద్రంగా పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఇక్కడి హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్?స్టిట్యూట్ ఆఫ్ లీడర్‌షిప్ ద్వారా 'కౌశలం' పేరుతో యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు.

# పొట్టిశ్రీరాములు యావత్
# తెలుగు ప్రజల ఆస్తి



(మొదటిపేజీ తరువాయి)

ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించారు. ఆయన కృషితోనే 1953 అక్టోబరు 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం, 1956 నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాయి. కొందరు ఈ తేదీలపై అనవసర రాజకీయం చేస్తున్నందునే, ఆయన ఆత్మార్పణ చేసిన రోజునే త్యాగాలకు గుర్తుగా నిర్వహించాలని నిర్ణయించాం" అని స్పష్టం చేశారు. పొట్టిశ్రీరాములు ఒక కులానికి చెందిన వ్యక్తి కాదని, యావత్ తెలుగు ప్రజల ఆస్తి, గుండె చప్పుడు అని కొనియాడారు. పొట్టిశ్రీరాములు స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని చంద్రబాబు తెలిపారు. అమరావతిలో స్మృతి వనంతో పాటు, చెన్నైలో ఆయన తుదిశ్వాస విడిచిన భవనాన్ని, నెల్లూరులోని నివాసాన్ని మెమోరియల్స్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ గతంలో తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టిశ్రీరాములు పేరు పెట్టారని, తాను కూడా నెల్లూరు జిల్లాకు పొట్టిశ్రీరాములు పేరు పెట్టానని గుర్తుచేశారు.

**మహా కుట్ర చేశారు**

గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. "మూడు రాజధానుల పేరుతో మహా కుట్ర పన్నారు. అసలు రాజధానే లేకుండా చేసి ప్రపంచం ముందు రాష్ట్రాన్ని అపహాస్యం చేశారు. కనీసం రాజధాని పేరు చెప్పుకోలేని దుస్థితి కల్పించారు. కానీ ఇప్పుడు మన రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పుకుంటున్నాం" అని అన్నారు. వ్యవసాయంతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేస్తున్నామని, 18 నెలల్లోనే రూ.21 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని తెలిపారు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల ఏర్పాటుపై వస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. ఈ విధానం వల్లే రహదారులు, విమానాశ్రయాలు అభివృద్ధి చెందాయని, ఇది పార్లమెంటరీ కమిటీ కూడా సమర్థించిన ఉత్తమ విధానమని అన్నారు. కాలేజీలు ప్రభుత్వ అజమాయిషీలోనే ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం పేరును 'వాసవీ పెనుగొండ'గా మారుస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. దీంతో ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు, మహిళలు ప్లకార్డులు ప్రదర్శించి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యమిస్తూ, తెలుగు జాతిని దేశంలోనే అగ్రస్థానంలో నిలపడమే ఎన్డీఏ కూటమి లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు.



# సంపాదకీయం

## ఇండియా వైపు అమెరికన్ కంపెనీలు



ఒకప్పుడు అమెరికా కంపెనీలు భారతదేశంలో పెట్టుబడి పెట్టడానికి అంతగా ఆసక్తిని చూపించేవి కాదు. ఒకవేళ పెట్టుబడులు పెట్టినప్పటికీ అనేక రకాల షరతులతో ఇక్కడికి వచ్చేవి. మనదేశంలో స్థిరమైన ప్రభుత్వాలు ఏర్పడకపోవడం వల్ల విదేశీ పెట్టుబడిదారులలో నమ్మకం ఉండేది కాదు. దీంతో కంపెనీలు ఏర్పాటు కాకపోవడంతో దేశానికి అంతగా ఆదాయం ఉండేది కాదు. 2014 నుంచి ఇప్పటివరకు దేశంలో స్థిరమైన ప్రభుత్వాలు ఏర్పడటం వల్ల పెట్టుబడిదారుల్లో నమ్మకం కలిగింది. దీనికి తోడు ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలు కంపెనీలకు అనుకూలంగా ఉంటున్నాయి. ముఖ్యంగా అమెరికన్ కంపెనీలు భారతదేశంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయి.అమెరికన్ కంపెనీలు భారతదేశంలో పెట్టుబడులు పెట్టడం ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ కు ఏ మాత్రం ఇష్టం లేదు. అందువల్లే భారత్ మీద నిత్యం చిమ్ముతూనే ఉన్నాడు. భారతదేశంలో పెట్టుబడులు పెట్టకుండా అమెరికా కంపెనీలను నియంత్రించడానికి ప్రయత్నిస్తున్నాడు. 145 కోట్ల వినియోగదారుల మార్కెట్ ఉన్న భారతదేశంలో పెట్టుబడులు పెట్టకపోతే తమకు లాభాలు రావని అమెరికన్ కంపెనీలు భావించి.. మనదేశంలో భారీగా పెట్టుబడి పెడుతున్నాయి. మైక్రోసాఫ్ట్ నుంచి మొదలు పెడితే అమెజాన్ వరకు అన్ని కంపెనీలు భారతదేశానికి క్యూ కడుతున్నాయి.అమెజాన్ ఇప్పటికే భారత దేశంలో విస్తృతంగా వ్యాపార కార్యకలాపాలు సాగిస్తోంది.. మరో మూడు లక్షల కోట్ల పెట్టుబడి పెట్టడానికి ఆ కంపెనీ ముందుకు వచ్చింది. మైక్రోసాఫ్ట్ కూడా 1,50,000 కోట్లతో పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చింది. గూగుల్ కూడా అత్యంత విలువైన డాటా సెంటర్లను ఏర్పాటు చేస్తోంది. భవిష్యత్తు కాలంలో ఇంకా ఎక్కువ స్థాయిలో కార్యకలాపాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని గూగుల్ ప్రకటించింది.. వాస్తవానికి ఈ మూడు సంస్థలు భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి ముందు.. ఆ కంపెనీ ప్రతినిధులను ట్రంప్ కలిశాడు.. మనదేశంలో పెట్టుబడులు పెట్టకుండా నిలిపివేయడానికి ప్రయత్నించాడు. కానీ ఆ కంపెనీలు ఏమాత్రం అందుకు ఒప్పుకోలేదు.అమెరికన్ కంపెనీలు భారతదేశంలోకి విపరీతంగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో ట్రంప్ ఏమాత్రం సహించలేకపోతున్నాడు. భారతదేశం మీద ఏదో ఒక రకంగా విమర్శలు చేస్తూనే ఉన్నాడు.. అమెరికన్ కంపెనీలను తీవ్రస్థాయిలో తప్పుపడుతున్న ట్రంప్.. తన రియల్ ఎస్టేట్ కంపెనీ ద్వారా ఇండియాలోనే పెట్టుబడులు పెడుతుండడం విశేషం. ఇప్పటికే హైదరాబాదులో ట్రంప్ టవర్స్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని మొదలుపెట్టాడు అమెరికా అధ్యక్షుడు. భవిష్యత్ కాలంలో తన వ్యాపారాన్ని ఇంకా పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. కానీ అమెరికన్ కంపెనీలను మాత్రం నిలువరిస్తున్నాడు.ట్రంప్ కు షాక్ ఇస్తూ అమెరికన్ కంపెనీలు భారతదేశంలో పెట్టుబడులు పెట్టడం వల్ల.. ఆర్థిక రంగం సమూల మార్పులకు గురవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం భారత్ ప్రపంచ ఆర్థిక శక్తులలో నాలుగో స్థానంలో ఉంది. ఇదే స్థాయిలో అమెరికన్ కంపెనీలు పెట్టుబడులు పెడితే నాలుగో స్థానం నుంచి మూడో స్థానానికి చేరుకునే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఒకప్పుడు చైనా సహాయంతో రష్యా స్థానాన్ని అమెరికా లాగేసుకుందని.. అయితే ఇప్పుడు చైనా ను అమెరికా నమ్మదని.. అమెరికాను కూడా చైనా నమ్మదని ఆర్థిక విశ్లేషకులు అంటున్నారు.. పైగా చైనాలో తన పెట్టుబడులను వెనక్కి తీసుకోవడానికి అమెరికా ఇష్టపడదని.. చైనాలో నియంతృత్వ ప్రభుత్వం ఉండడంతో అమెరికా కంపెనీలు ప్రత్యామ్నాయంగా భారత్ వైపు చూస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.

పైగా భారత దేశంలో 145 కోట్ల జనాభా ఉన్న నేపథ్యంలో అమెరికన్ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెడుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. మరో వైపు మెరికా భారతదేశంపై వాణిజ్య ఒత్తిడి పెడుతున్నప్పటికీ, దాని సొంత ఆర్థిక?సాంకేతిక క్షేత్రాలు నష్టపోతున్నాయి. ట్రంప్ విదేశాంగ విధానం విఫలమనే ఆరోపణలు ఎదుగుతున్నాయి. భారత్‌తో పోలిస్తే, ఇజ్రాయెల్, రష్యా, గూగుల్ వంటి శక్తులు భారత్‌తో భాగస్వామ్యాలు పెంచుతున్నాయి.భారత్‌పై అదనపు సుంకాలు విధించి, వ్యవసాయ ఎగుమతులను (ముఖ్యంగా బియ్యం) నిరోధించాలని అమెరికా ప్రయత్నిస్తోంది. ఈ చర్యలు అక్కడి రైతులను కూడా ఆగ్రహపరుస్తున్నాయి. పాకిస్తాన్‌తో సన్నిహితత్వం కలిగి ఉండటం వల్ల ట్రంప్ విదేశ విధానం ప్రశ్నార్థకమవుతోంది, దీనికి నోబెల్ బహుమతి వ్యామోహం కూడా కారణంగా చెబుతున్నారు.గూగుల్ 2029 నాటికి భారత్‌లో 70 మిలియన్ డాలర్ల పెట్టుబడితో డేటా సెంటర్ నిర్మిస్తానని ప్రకటించింది. భారత్ డేటా సెంటర్ల ర్యాంకింగ్‌లో 14వ స్థానంలో ఉంది, అమెరికా, రష్యా, చైనా ముందున్నాయి. ఆసియా నిపుణులపై అమెరికా పరిమితులు వల్ల భారతీయులు కెనడా, ఆస్ట్రేలియా, యూకే వైపు మళుతున్నారు. మైక్రోసాఫ్ట్ కూడా ఇలాంటి ప్రణాళికలు ప్రకటించింది, దీనివల్ల భారత్‌లో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి.ఇజ్రాయెల్ భారత్‌తో రక్షణ ఒప్పందం కుదుర్చుకుంది. దేశంలోనే ఆయుధాల తయారీకి ముందుకు వచ్చింది. స్థానిక సంస్థలతో కలిసి ఈ ప్రాజెక్టులు అమలు చేస్తారు, దీనివల్ల పాకిస్తాన్, టర్కీలకు షాక్ ఇచ్చారు. అమెరికా ఈ అభివృద్ధిని ఎలా తీసుకుంటుందనే ఆందోళన పెరిగింది. రష్యా కూడా ఆయుధ తయారీలో భారత్‌తో సహకారం పెంచుతోంది.అమెరికా పాకిస్తాన్‌తో క్రిటికల్ మినరల్స్ ఒప్పందం చేసుకుంది, గనుల నుంచి వనరులు త్వరగా వెలికితీయాలని ప్రణాళికిస్తోంది. భారత్‌పై టారిఫ్‌లు వేస్తున్నప్పుడు, పాకిస్తాన్‌లో పెట్టుబడులు పెంచడం వివాదాస్పదంగా మారింది.

# ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు గడ్డు కాలం....!

**అనంతపురం – సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** దశాబ్దం కిందట దేశంలోనే అగ్రగామిగా ఉన్న ఆంధ్రప్రదేశ్ నేడు పూర్తిగా ప్రమాదపు అంచున ఉన్నట్లు కనిపిస్తుంది. గత దశాబ్ద కాలంగా ఇంతటి అధోగతికి కారకులెవరు? రాష్ట్రం విడిపోయిన తరువాతరెండు రాష్ట్రాల్లోవిద్య ప్రమాణాలు నీచ స్థితి చేరుకున్నాయి. గత పదిహేను సంవత్సరాలుగా అధ్యాపకనియామకాలు చేపట్టక పోవడం, రీసెర్చ్ గ్రాంటులు పూర్తిగానిలిపివేయడం, పరిశోధనలు పక్కదారి పట్టిచివరికి అధఃపాతాళానికి చేరింది. వంద సంవత్సరాల ఘనకీర్తి గడించిన ఆంధ్ర విశ్వవిద్యాలయంలో, డెబ్బై సంవత్సరాలు కిందట నెలకొల్పిన శ్రీ వెంకటే శ్వర విశ్వవిద్యాలయం, నలభై ఐదు సంవత్సరాల కిందట నెలకొల్పిన శ్రీకృష్ణదేవ రాయ, ఆచార్య నాగార్జున విశ్వ విద్యా లయం అధ్యాపకుల కొరతతో దాదాపు మూసివేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు అనిపిస్తుంది. చివరికి 18 నెలలుగా ఇన్‌చార్జి ఉపకులపతుల పాలనలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. 1260 సీట్లకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తే కేవలం 480 అప్లికేషన్స్ వచ్చాయి, పీజీ కోర్సులకు ఎంట్రన్స్ అక్కర్లేదు ఎవరైనా వచ్చి చేరమని మరొక ప్రకటన ఇచ్చారు దాదాపు 600 పై చిలుకు ఖాళీలకు పదుల సంఖ్యలో ప్రవేశాలు జరిగాయి. అమెరికాలో ఒక ప్రభుత్వం గద్దె దిగగానే ప్రభుత్వంలో ఉన్న సెక్రెట్రీలు కూడా అధికారం నుంచి తప్పుకోవడం జరుగుతుంది. అలాగే మన రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు సంబంధించిన రిజిస్ట్రార్లు రెక్టార్లు చివరికి ఉపకుల పతులు, అధికార యంత్రాంగం యూనివర్సిటీలను వదిలి వెళ్లడం జరిగింది. గతంలో వీరు రిజిస్ట్రార్, రెక్టార్, విసి , డైరెక్టర్ల్ల కావాలంటే స్థానికంగా ఉన్న మంత్రుల కాళ్ళు పట్టుకుని అంతో ఇంతో సమర్పించుకుని వచ్చి అడ్డగోలు నియామకాలు చేపట్టి అనతికాలంలో లక్షలు గడించి కోట్లు బిల్లులు చేసి ఇష్టానుసారంగా వ్యవహ రించిన వారు ఎప్పుడైతే కొత్తగా ప్రభుత్వం ఏర్ప డిందో, ఏదో సంక్షోభం ఉపద్రవం ముంచు కొచ్చి నట్లు విధులకు దూరంగా ఉండటం లేకపోతే ఆరోగ్య కారణాల వల్ల విధులకు రాజీనామామా చేయ డం , కేసుల నుంచి తప్పించుకొనే ప్రయత్నం చేస్తు న్నారు. వీరందరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు. వారు నిర్వహించిన నిర్వహించిన అన్ని అడ్డగోలు నియామకాలు వాటిపై చర్యలు అన్ని ప్రశ్నార్థకంగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలవుతోంది అనంతపురం జిల్లా ఉన్నత విద్య అభివృద్ధి ఎలా ఉందో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం చూస్తే సరిపోతుంది. విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్న ఇంచార్జి వీసీ తనకు ఏమీ పట్టనట్లు నిర్లిప్త ధోరణితో మరో సంవత్సరంలో శాస్వితంగా మూసివేతకు గురవుతుంది. గత ఏడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆగ మేఘాల మీద రాష్ట్రంలో ఉన్న ఉపకు లపతులను పొమ్మనలేక పొగ పెట్టారు. గత రెండు సంవత్సరా ంగా ఎదుగూ బొదుగూ లేకుండా విశ్వవిద్యాలయం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా మారింది. ఏమి చేస్తున్నావ్ కోడలా అంటే ఉలగబోసి తీసుకుంటున్నాను అన్నట్లు ఉంది విశ్వవిద్యాలయాల పరిస్థితి. మూడు నెలలకోసారి జరగాల్సిన పాలకమండలి సమావేశం పది నెలల కో సారి జరుగుతోంది. ఉన్నత విద్య నిధులు నిలుపుదల




చేస్తామని యూజీసీ కొన్ని విశ్వవిద్యాలయాలకు తాఖీదు ఇచ్చారు. ఇంచార్జి ఉపకులపతి నిర్లిప్త ధోరణి వలన సమస్యలు జటిలమైపోయాయి. ప్రతి చిన్న విషయం వేచి చూసే ధోరణి. ఇక్కడ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు పెనం నుంచి పొయ్యిలోకి పడినట్లు భావిస్తున్నారు. దిన దిన గండం నూరేళ్ళాయ్యుష్షు అన్నట్లు విశ్వవిద్యాలయ అధికారుల తీరు విశ్వవిద్యాలయ పురోగతికి ప్రతిబంధకంగా మారింది. చిన్న విషయాల పట్ల నిర్ణయం తీసుకోకుండా దాటవేసే ధోరణి, అనాలోచిత నిర్ణయాలతో విద్యార్థుల పాలిట శాపంగా మారుతున్నాయి. విశ్వవిద్యాలయం అధికారుల తీరు రోత పుట్టిస్తున్నాయి. నవ్వి పోదురు గాక నాకేటి సిగ్గు అన్న చందంగా విశ్వవిద్యాలయ అధికారులు ప్రవర్తిస్తున్నారు. ఎప్పుడు ఏ సమస్య ముందుంచినా నేను ఇంచార్జి వీసీని కొద్దికాలం ఓపిక పట్టండి శాశ్విత విసి వస్తారు అని సెలవిస్తున్నారు. కానీ పేరుకే ఇంచార్జి వీసీ చేసేవన్నీ శాశ్విత వీసీ కంటే ఎక్కువగా చేస్తున్నారు. చదువుకున్న మేధావులు ఉన్న విశ్వవిద్యాలయంలో అర్జీ ఇస్తే అంతే సంగతి. వచ్చిన అర్జీలకు సమాధానం చెప్పరు. ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు ప్రవర్తిస్తారు. కొన్ని విషయాలు నోరు మాట్లాడు తుంది నొసలు వెక్కిరిస్తుంది అన్న చందాన వ్యవహరిస్తుంటారు. ప్రతి విషయానికి దాట వేసే ధోరణి కనిపిస్తుంది. అధికారుల మధ్య పాలక మండలి సభ్యుల మధ్య సమన్వయం లోపించి గోటితో పోయేదానికి గొడ్డలి పట్టుకుంటున్నారు. ప్రభుత్వం విశ్వవిద్యాలయాలను పటిష్టపరచడం, ఉపకులపతి నియామకాన్ని మరచిపోయి విశ్వవిద్యాలయాన్ని శాశ్వితంగా మూసివేసే ఆలోచనలో ఉన్నట్లు కనిపిస్తుంది. మారాల్సింది అధికారుల పనితీరు మనుషులు కాదు. 2017, 2018 లలో జరిగిన అడ్డగోలు నియామకాల్లో పోస్టులు పొందిన వారిని తొలగించండి అని 2022 లో హైకోర్టు తెలిపింది. ఈ నియామకాలు చేసిన ఉపకులపతులు రిజిస్ట్రార్ల పై చర్యలకు ఉపక్రమించాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. ప్రభుత్వం వచ్చి 18 నెలలు గడుస్తున్నా విశ్వవిద్యాలయాలలో పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. నాలుగు సంవత్సరాల క్రితం రీసెర్చ్ స్కాలర్లు సమర్పించిన థీసిస్ గ్రంథాలకు చెదలు పట్టింది కానీ వారి వైవా మోక్షంలేదు. రౌతు మెత్తగుంటే గుఱ్ఱం మూడు కాళ్లతో పరుగెత్తింది అన్న చందంగా మారింది విశ్వవిద్యాలయాల పరిస్థితి. కొత్త కోర్సులకు , కొత్త కళాశాలలకు అఫిలియేషన్ కు మోక్షం లేదు. ఇప్పుడున్న పరిస్థితి చూస్తే మూలిగే నక్క మీద తాటి పండు పడ్డట్టు అన్న చందంగా మారింది విశ్వవిద్యాలయాల పరిస్థితి. ఈ విద్యా సంవత్సరంలో చాలా విశ్వవిద్యాలయలలో కొన్ని విభాగాలు మూసి వేయక తప్పదు. ఉన్న సీనియర్ అధ్యాపకులు రిటైర్ కావడం, గత దశాబ్ద కాలం నుండి నియామకాలు లేకపోవడం, దశాబ్ద కాలం కిందట చేరిన వారిని ఇంత వరకు రెగ్యులరైజ్ చేయకపోవడం సమస్యగా మారింది. కొత్త నియామకాలు చేపట్టక ,రీసెర్చ్ ఎంట్రన్స్ నోటిఫికేషన్ ఇవ్వకుండా కాలం వెలిబుచ్చుతున్నారు. ఇంగ్లీషు, జువాలజీ, కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ , పాలిమర్ సైన్స్, ఫిజిక్స్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, సెరికల్చర్, తెలుగు, హిందీ, ఇన్స్ట్రుమెంటేషన్, బయో కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, జియాలజీ , సోషియాలజీ, జియోగ్రఫీ, మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్ మూతపడ్డాయి. ఇక సీనియర్ ప్రొఫెసర్లు ఒక్కటంటే ఒక్క ప్రాజెక్ట్ లేదు, సెమినార్ గ్రాంటు లేదు, నూతన ఆవిష్కరణలు పేటెంట్ల అంతకంటే లేవు. వీరు రిటైర్ అయిన రోజు ఏదో మొక్కుబడిగా ఒక కార్యక్రమం జరిపి భోజనాలు చేసి వెళ్తుంటారు. విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలు లేవు అధ్యాపకులకు బోధన సామర్థ్యాలు అంతకంటే లేవు. యాభై సంవత్సరాలు ముందు వెలసిన విశ్వవిద్యాలయాల్లో అకడమిక్ స్టాఫ్ కాలేజ్ లు మూతపడి దశాబ్దం అవుతుంది. రిఫ్రెషర్ కోర్సులు, ఓరియెంటేషన్, స్టాఫ్ డెవలప్మెంట్ కోర్సు అన్నీ అనీత విద్య లాగా టీవీలు, కంప్యూటర్లలో బోధిస్తున్నారు. ఉన్న విశ్వవిద్యాలయాలు పటిష్టం చేయకుండా కొత్తగా క్లస్టర్ యూనివర్సిటీ, గిరిజన యూనివర్సిటీ, ఉర్దూ యూనివర్సిటీ, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో శంకు స్థాపన చేశారు. విద్యాలయాలంటే బిల్డింగులు స్థలాలు కాదు, అధ్యాపకులు లేకుండా విశ్వవిద్యాలయాలు ఎలా నడుపుతారో బోధపట్టం లేదు. పరీక్షలు సకాలంలో జరపరు, ఫలితాలు వెల్లడించరు, పిహెచ్డి వైవా జరపరు. పరిస్థితి ఇలా ఉంటే మరో రెండు సంవత్స రాలలో విశ్వవిద్యాల యాలను శాశ్వితంగా మూసి వేయడం ఖాయమని పిస్తుంది. ఉర్దూ, కేంద్ర విశ్వవి ద్యాలయాలు మొదలుపెట్టి ఏడు సంవత్సరాలైన నిధుల లేమితో ఎప్పుడూ స్మశాన ప్రశాంతత నెలకొంటున్నాయి. విద్యలో నాణ్యత ఉండాలని క్వాలిటీని పెంచడానికి కొత్తగా కన్సల్టెన్సీలు ద్వారా కో ఆర్డినేటర్ల ను నియమించి ఉన్న కొద్ది మంది అధ్యాపకులతో కమ్యూనిటీ డెవలప్మెంట్, స్కిల్ డెవలప్మెంట్, ఇండస్ట్రీ ఇన్స్టిట్యూట్ ఇంటరాక్షన్ సెల్ ఏర్పాటు చేసి అర్థం పర్థం లేని పనులు చేయిస్తున్నారు. కొత్త కోర్సులు బోధించడానికి బోధకులు లేకపోవడంతో విద్యార్థులు సుదూర ప్రాంతాలకు తరలిపోతున్నారు. అధ్యాపకులకు ఓరియెంటేషన్, రిఫ్రెషర్ కోర్సులు లేవు, బోధనా నైపుణ్యాలు మెరుగుపడాలంటే బోధకులకు కొత్త అంశాల పట్ల శిక్షణ ఉండాలి. ఉపాధ్యాయ శిక్షణా మార్గదర్శి, మెటీరియల్ దొరకడం లేదు. అధ్యాపకులకు పునశ్చరణ తరగతులు, ఓరియెంటేషన్ కోర్సులు లేక కళాశాలలో బోధన చప్పగా ఉంది. యుద్ధ ప్రాతిపదికన విశ్వవిద్యాలయాల ప్రక్షాళన చేయకపోతే రెండు మూడు సంవత్సరాలలో శాశ్వితంగా కనుమరుగవుతాయనీ అభిప్రాయం వ్యక్తం చేశారు డా. ముచ్చుకోట . సురేష్ బాబు, విద్య పరిరక్షణ కమిటీ సభ్యులు...!

## గుంతకల్ డివిజన్ స్థాయి మహిళా ఉపాధ్యాయుల త్రోబాల్ పోటీలు నిర్వహణ



**పామిడి –సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** గుంతకల్ డివిజన్ స్థాయి మహిళా ఉపాధ్యాయుల త్రోబాల్ పోటీలు సోమవారం పామిడి పట్టణంలోని టి.సి.జి.హెచ్.ఎస్ పాఠశాల ప్రాంగణంలో విజయ వంతంగా నిర్వహించబడినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో పామిడి, గుత్తి, పెద్దవడుగూరు, గుంతకల్, ఉరవకొండ, విడపనకల్, యాడికి, వజ్రకరూర్ మండలాల నుండి మొత్తం 8 జట్లు పాల్గొన్నాయి. మొత్తం 7 మ్యాచ్‌లు ఉత్సాహభరితంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పామిడి మండల విద్యాశాఖ అధికారి జి. సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆతిథ్య పాఠశాల టి.సి.జి.హెచ్.ఎస్ పామిడి ప్రధానోపాధ్యాయులు కె. రామ్‌కుమార్ ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. ఈ పోటీలను గుంతకల్ డివిజన్ సమన్వయకర్త ఎల్. నాగరాజు పీడీ, పామిడి మండల సమన్వయకర్త కె. రామ్‌కృష్ణ పీడీ, ఎన్.నవీన్ పీడీతో పాటు మిగతా 7 మండలాల మండల సమన్వయకర్తలు మరియు మండల విద్యాశాఖ అధికారులు ( ఎంఈఓలు) పర్యవేక్షించారు. ఫైనల్ మ్యాచ్ విడపనకల్, వజ్రకరూర్ మండలాల మధ్య జరగగా, ఉత్కంఠభరితమైన పోటీలో విడపనకల్ జట్టు విజేతగా నిలిచింది, వజ్రకరూర్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు భోజన సదుపాయాలను స్థానిక ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం సహకారం తో పామిడి చైతన్య పాఠశాల కరస్పాండెంట్ రమణారెడ్డి ఆధ్వర్యంలో అందించారు. కప్‌లు, మెడల్స్‌ను కృష్ణవేణి పాఠశాల కరస్పాండెంట్ అనూరాధ స్పాన్సర్ చేశారు. విజేతలు, రన్నర్స్‌కు నిర్వహించిన విజయోత్సవ కార్యక్రమంలో పై పేర్కొన్న గౌరవనీయులు పాల్గొని కప్‌లు, మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మండల ఎంఈఓ-2జి. సత్యనారాయణ మాట్లాడుతూ మహిళా ఉపాధ్యాయులు క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉత్సాహాన్ని పెంపొందించుకోవాలని, అలాగే విద్యార్థులకు క్రీడల పట్ల ఆదర్శంగా నిలవాలని తెలిపారు.

## వైసీపీ నాయకుల బైక్ ర్యాలీతో హోరెత్తిన 'అనంత'

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అనంతలో భారీ బైక్ ర్యాలీ
- కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించిన వైసీపీ శ్రేణులు
- వైసీపీ జిల్లా కార్యాలయం నుంచి బుక్కరాయసముద్రం వరకు ర్యాలీ
- కేంద్ర కార్యాలయానికి 4,55,840 సంతకాల ప్రతుల ప్రత్యేక వాహనం తరలింపు
- జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి చెన్నకేశవరెడ్డి




**పామిడి– సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా హెూరెత్తిన అనంతపురం వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి జిల్లా అధ్యక్షురాలు నైరుతి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో భారీ బైక్ ర్యాలీలో వైసీపీ జిల్లా కార్యాలయం నుంచి ఫ్లై ఓవర్, టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్, పాతూరు మీదుగా బుక్కరాయసముద్రం వరకు కొనసాగిన బైక్ ర్యాలీ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హెూరెత్తిన వైఎస్ఆర్‌సీపీ శ్రేణులు అనంతపురం జిల్లాలో సేకరించిన 4,55,840 సంతకాల ప్రతులను ప్రత్యేక వాహనంలో ఉంచి తాడేపల్లి కేంద్ర కార్యాలయానికి తరలింపు. ఈ కార్యక్రమంలో గుంటకల్ నియోజకవర్గం వైయస్సార్సీపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిండు కుండలా తొణికిసలాడుతున్న యర్రబల్లె చెరువే

**- దశాబ్దాల పాటు సీఎంలు చేయలేని పని బిటెక్ రవి కృషి**
**- కూటమి ప్రభుత్వానికి పులివెందుల రైతులు ధన్యవాదాలు**




**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 15 :** పులివెందుల గడ్డ మీద పుట్టారు తండ్రీకొడుకులు ఇద్దరూ ముఖ్యమంత్రులుగా రాష్ట్రాన్ని ఏలారు. కానీ ఏం లాభం? సొంత నియోజకవర్గంలోని "యర్రబల్లె చెరువు"కు నీళ్లివ్వలేకపోయారు. నాలుగు నెలల క్రితం జరిగిన పులివెందుల జడ్పీటీసీ ఉపఎన్నిక సమయంలో కూటమి ప్రభుత్వం, బిటెక్ రవి , పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి పులివెందుల మండల ప్రజలకు యర్రబల్లె చెరువును నింపుతాం అని హామీ ఇవ్వడం జరిగింది. ఇచ్చిన హామీని ప్రజల కష్టాన్ని తన కష్టంగా భావించి, పట్టుబట్టి హెచ్ ఎన్ ఎస్ ఎస్ ద్వారా యర్రబల్లె చెరువుకు నీళ్లు తెప్పించారు. ఈ రోజు నిండు కుండలా తొణికిసలాడుతున్న యర్రబల్లె చెరువే దీనికి సాక్ష్యం! మాటల మనుషులు ఎవరో.. చేతల మనుషులు ఎవరో ఈ నీళ్లను చూస్తే అర్థమవుతుంది. దశాబ్దాల పాటు సీఎంలు చేయలేని పనిని, ఒక బాధ్యత గల నాయకుడిగా చేసి చూపించిన బి.టెక్ రవి కి,సీఎం చంద్రబాబుకి కూటమి ప్రభుత్వానికి పులివెందుల రైతులు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

## రైళ్ల రాకపోకలకు స్టాపింగుకు సహకరించండి

**- రైల్వే మంత్రికి వినతిని అందించిన ఎంపీ అవినాష్ రెడ్డి**



**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 15 :** కడప జిల్లాలో వివిధ రైళ్ల పొడిగింపుకు, నిలుపుదలకు సహకరించాలని జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రికి వినతిని అందించారు. ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌ని ఎంపీ అవినాష్ రెడ్డి కేంద్ర మంత్రి కార్యాలయంలో మంత్రిని కలిసి మైసూరు - రేణిగుంట వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను కడప వరకూ పొడగించాలని, మచిలీపట్నం-ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌కు ముద్దనూరులో స్టాపింగ్ కల్పించాలని తన లేఖ ద్వారా పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి వినతి పత్రాన్ని అందించారు. ఈ ప్రాంత ప్రజల ప్రయాణ సౌకర్యాలను మెరుగుపరిచేందుకు త్వరితగతిన ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## వైసీపీ కోటి సంతకాల ర్యాలీలో పులివెందుల వైసీపీ నాయకులు

**పులివెందుల- సూర్య వాస్తవం, డిసెంబర్ 15 :** మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ ప్రతులను సోమవారం సెంట్రల్ ఆఫీసుకు చేరుస్తున్న సందర్భంగా కడపలో జరిగిన ర్యాలీలో పులివెందుల నియోజకవర్గ వైసిపి నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, వేల్పుల రాము, మున్సిపల్ కో-ఆప్షన్ సమీముల్లా, చంద్రమౌళి, కనక, సంపత్, నాగరాజు, భాస్కర్, వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి సూచనల మేరకు కోటి సంతకాల సేకరణ ర్యాలీకి పులివెందుల వైసీపీ నాయకులు పాల్గొనడం జరిగిందని, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమం విజయవంతం అయినట్టు తెలిపారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో పేద విద్యార్థులకు వైద్య విద్య, అలాగే ప్రజలకు వైద్యం దూరమవుతుందని ఆరోపించారు. వైసీపీ హయాంలో 17 మెడికల్ కాలేజీలను తీసుకొచ్చామని, వాటిలో ఐదింటిని పూర్తి చేశాం. ఆ ఐదింటిలో తమ హయాంలోనే అడ్మిషన్లు కూడా పూర్తి చేశామన్నారు. అయితే వైసీపీ హయాంలో కాలేజీలనే కట్టలేదని టీడీపీ నాయకులు దుర్మార్గమైన ఆరోపణలు చేశారని మండిపడ్డారు. కావాల్సిన వాళ్లకు మెడికల్ కాలేజీలను కట్టబెట్టేందుకు పీపీపీ విధానంలో ప్రైవేటీకరణ వైపు చంద్రబాబు అడుగులు వేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గ వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల్లో కోర్ కమిటీ సమావేశం

**సింహాద్రిపురం - సూర్య వాస్తవం, డిసెంబర్ 15 :** సింహాద్రిపురం మండలం హిమకుంట్ల, పంచాయితి హిమ కుంట్ల, అగ్రహారం, గ్రామాల్లో కోర్ కమిటీ సమావేశ కార్యక్రమం మండల వైసిపి నాయకుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ... మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి ఆదేశాల మేరకు వైసిపి పార్టీ పటిష్టత కోసం కోర్ కమిటీ సమావేశాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో వైసిపి విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా ముందుండి పని చేయాలన్నారు. వైసిపి పార్టీలు విధేయుడుగా పనిచేసిన వారికి పార్టీ గుర్తింపు తప్పని సరిగా ఉంటుందన్నారు కూటమి అరాచకాలను తిప్పికొట్టే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల అబ్జర్వర్లు, కొత్తపల్లి భాస్కర్



రెడ్డి, గ్రామ నాయకులు నెట్‌క్యాప్ ఎక్స్ డైరెక్టర్ కిషోర్ రెడ్డి, సిబి .విజయ భాస్కర్ రెడ్డి, సిబి.గోపాల్ రెడ్డి, రవి(హైటెక్), సిబి. శివానందరెడ్డి, వెంకటనా గిరెడ్డి, రామనాథ రెడ్డి, సి కె.వెంకటనాగిరెడ్డి, సి వై.రంగారెడ్డి, సి బి .నాగేశ్వర రెడ్డి, సికె.బాబురెడ్డి, పి.శివశంకర్ రెడ్డి, సివిఎస్.రామాంజల్ రెడ్డి, సి.జనార్ధన్ రెడ్డి, సి.రామచంద్ర రెడ్డి, సికె.సుబ్బారెడ్డి, అక్కిరెడ్డిగారి. సుబ్బారెడ్డి, సాంబశివారెడ్డి, చిన్నారెడ్డి, రామచంద్రారెడ్డి, నరేంద్రరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, సికె. వెంకట రామిరెడ్డి, సి.నాగ యశ్వంతరెడ్డి, డి.వేణు గోపాలరెడ్డి, సి.రామగోపాల్ రెడ్డి, రఘు, రామకేశవ సి.శ్రీనివాసుల రెడ్డి, సి.వెంకటరెడ్డి, చంద్రహాసరెడ్డి సోషల్ మీడియా తిరుమణిరెడ్డి, మహిళాలు నాయకులు, కార్య కర్తలు, పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.



## కమిటీలే పార్టీకి పట్టుగొమ్మలు





**లింగాల - సూర్య వాస్తవం, డిసెంబర్ 15 :** వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి, వైయస్ అవినాష్ రెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ గ్రామ అనుబంధ విభాగాల కమిటీ పర్యవేక్షణ వైసిపి నాయకుడు బాబు రెడ్డి మండల వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం లింగాల మండలం అక్కులుగారిపల్లె గ్రామంలో మండల, గ్రామ నాయకులు, కార్యకర్తల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యన్నారు. వైయస్ఆర్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి, వైయస్ అవినాష్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జరగబోయే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుల్లా పనిచేయాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను గ్రామ ప్రజలకు వివరించాలన్నారు. 2.0 జగనన్న పాలనలో కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. అలాగే పదవులు కూడా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, వైకాపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కలసికట్టుగా పనిచేస్తే విజయం సాధించవచ్చు

**- మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి**





**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 15 :** పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డ్ వైయస్ మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో అనుబంధ విభాగాల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, పులివెందుల పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ మల్లి పట్టణ ఉపాధ్యక్షుడు పార్లపల్లి కిషోర్, లు వైసిపి నాయకులు ఆధ్వర్యంలో ముందుగా వైస్సార్ విగ్రహానికి పూల మాల వేసి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైయస్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కలిసికట్టుగా పనిచేస్తే విజయం సాధించవచ్చునని అన్నారు పార్టీ బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కమిటీలతోనే కూటమి ప్రభుత్వ కుట్రలను తిప్పి కొట్టొచ్చు అన్నారు. వార్డులలో ఇంటింటికి వెళ్లి కూటమి వైఫల్యాన్ని ప్రజలకు వివరించాలన్నారు. జగన్మోహన్ రెడ్డి, అవినాష్ రెడ్డి నాయకత్వంలో ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేస్తే ఫలితం దక్కుతుందన్నారు. 2029లో జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో గెలిపి ధ్యేయంగా ప్రతి నాయకుడు కార్యకర్త, సైనికుల్లా పనిచేయాల న్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు వైకాపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మదనపల్లి నియోజకవర్గానికి 18 కోట్లతో రోడ్లు

**- మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి**



**మదనపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 15 :** మదనపల్లి నియోజకవర్గానికి రూ.18 కోట్లతో రోడ్లను మంజూరు చేశామని రోడ్లు మరియు భవనముల శాఖా మంత్రి బిసి జనార్దన రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్ అండ్ బి అతిథి భవనంలో సోమవారం ఎమ్మెల్యే షాజహాన్ భాషతో కలసి మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రోడ్ల రూపు రేఖలు మార్చి, ఇన్ఫ్రా స్ట్రక్చర్ డెవలప్ చేస్తామన్నారు. తద్వారా పరిశ్రమలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు స్థానిక టౌన్ బ్యాంకు సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు డబుల్ రోడ్డు వేయడానికి రూ.3 కోట్లు, నిమ్మనపల్లె, రామసముద్రం, బెంగుళూరు రోడ్లు రెనీవల్ చేసి వెడల్పు చేయడానికి మరో రూ. 15 కోట్లను విడుదల చేసి వేగవంతంగా రోడ్లను అభివృద్ధి చేసి రూపు రేఖలు మారుస్తా మన్నారు. మొదట రాజంపేట పార్లమెంట్ కార్యాలయానికి వచ్చిన మంత్రి మదనపల్లె తంబళ్లపల్లె నియోజకవర్గం వర్గాల టిడిపి నాయకులు కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకుని వారి నుంచి అర్జీలను స్వీకరించారు. ఆ లోటుపాట్లపై బైటికి మంత్రి బహిర్గతం చేయకుండానే వెళ్లిపోయారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం, సమర్పణ వెలకట్టలేనిది

**- ప్రిన్సిపల్ ఎస్. నాగేంద్ర**




**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 15 :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారముగా స్థానిక వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశా లలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలను ఘనంగా జరిపినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్. నాగేంద్ర తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ సిద్ధాంతములైన సత్యం, అహింసల కు జీవితాంతం కట్టుబడి, కృషిసల్పిన మహనీయుడని కొనియాడారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ .ఏం. ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ భారత దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు లో ఆయన చూపిన చొరవ ,త్యాగం వెలకట్టలేనివని కొనియాడారు. స్వాతంత్ర ఉద్యమంలో సామాజిక సమస్యలను పరిష్కరించుటలో, ఆయన పాత్ర మహోన్నతమైనదని డాక్టర్. సి.మల్లేశ్వరమ్మ తెలియజేశారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రధానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్. ఎం. శ్రీకాంత్ రెడ్డి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## వాహనాలు తనిఖీ

**- పులివెందుల అర్బన్ సీఐ సీతారామరెడ్డి**

**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** పులివెందుల పట్టణ పరిధిలో ప్రధాన సర్కిల్ వద్ద సోమవారం అర్బన్ సీఐ సీతా రామరెడ్డి ఎస్ఐ తన సిబ్బంది తోటి పులివెందుల పట్టణంలోని వాహనా దారులకు రోడ్డు ప్రమాదాల గురించి అవగాహన తెలియ జేస్తూ చలానా విధించారు. లైసెన్స్, ఇన్సూరెన్స్ హెల్మెట్ లేని వారికి చలానా విధించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మైనర్ బాలులకు వాహనాలు యువరాదన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే విధించడం జరుగుతుందని, ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించినప్పుడే ప్రమాదాలు అరికట్టవచ్చునని, ప్రతి వాహనదారుడు వాహనానికి సంబంధించి రికార్డులు తమ వద్ద తప్పనిసరిగా ఉంచుకోవాలని, పలు సూచనలు సలహాలు అందిస్తూ రికార్డులు లైసెన్సులు లేనివారికి జరిమానాలు విధించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 96 వినతులు...!

### - ప్రజల సమస్యలకు చట్టబద్ధ పరిష్కారం అందించడమే లక్ష్యంగా కృషి చేయండి
### - జిల్లా ఎస్పీ పి.జగదీష్




**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** అనంతపురం జిల్లా పోలీస్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలోకి వచ్చే ప్రతి పిటీషన్‌ను విచారించి తక్షణమే పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ పి.జగదీష్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 96 ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను లోతుగా అర్థం చేసుకుని, అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ గారు మాట్లాడారు. సమన్వయం చేసి చట్టపరంగా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఫిర్యాదుల్లో భార్యాభర్తల మధ్య వివాదాలు, కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు వంటి అంశాలు ప్రధానంగా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో మహిళా డీఎస్పీ ఎస్. మహబూబ్ బాషా మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

### - అప్పుల బాధలే ఆత్మహత్యకు కారణం అంటున్న పోలీసులు



**మదనపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం, బసినికొండలో ఉన్న నక్కలకుంట చెరువులో దూకి సమోసాల వ్యాపారి ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. ఘటనపై తాలూకా సిఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు.. భజనకొండ కష్టాల్లో కాపురం ఉంటున్నారు. చంగల్ రెడ్డి కొడుకు చంద్రశేఖర్ రెడ్డి(46) సమోసాల వ్యాపారం చేస్తూ భార్య రేణుక, తన ముగ్గురు పిల్లలను పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో స్థానిక వడ్డీ వ్యాపారుల చెంత చేసిన సుమారు 5 లక్షలకు పైగా అప్పులు తీర్చలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడని, భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొందన్నారు. అప్పుల బాధ తాళలేక రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన చంద్రశేఖర్ రెడ్డి అదృశమయ్యాడని భార్య రేణుక తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా స్థానిక నక్కల కుంట చెరువు తూము వద్ద గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి తేలియాడుతూ కనిపించడం సోమవారం ఉదయం స్థానికులు గుర్తించారన్నారు. అక్కడి ప్రజలు తమకు ఇచ్చిన సమాచారంతో వెంటనే వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి, దర్యాప్తు అనంతరం మృతుడి ఆచూకీ తెలుసు కున్నట్లు చెప్పారు. మృతదేహాన్ని స్థానికుల సాయంతో వెలికి తీసి పంచనామ అనంతరం పోస్టుమార్టం కోసం స్థానిక జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించామన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# స్కూటర్ ఢీకొని రైతుకు తీవ్రగాయాలు



**మదనపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** స్కూటర్ ఢీకొని రైతు తీవ్రంగా గాయపడ్డ సంఘటన సోమవారం చౌడేపల్లి మండలంలో జరిగింది. ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు.. మండలంలోని ఏ కొత్తకోట పంచాయతీ, బండ్లపల్లికు చెందిన రైతు గిరినాథరెడ్డి (65), స్కూటీలో సొంత పనిపై చౌడేపల్లి కి వచ్చి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. ఆమని కుంట వద్ద వస్కోట వేగంగా వచ్చి రైతును ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రైతును చికిత్స కోసం వెంటనే మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్లు ప్రథమ చికిత్సలు అందించి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు వెళ్లాలని రెఫర్ చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



**మదనపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** కురబలకోట మండలంలో సోమవారం సాయంత్రం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో నువ్వు రైతుతోపాటు విద్యార్థి తీవ్రంగా గాయపడ్డారు. పట్టణపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కురబలకోట మండలం గౌని వారి పల్లికి చెందిన ఏ.సిద్ధారెడ్డి(65), సొంత పనిపై స్కూటీలో అంగళ్లుకు వెళుతుండగా విషం కళాశాల సమీపంలో పరీక్షలు రాసి మొలకల చెరువుకు వెళుతున్న విద్యార్థి ఖదీర్ బైకు వెనకనుంచి ఢీకొట్టి ఇద్దరు గాయపడ్డారు. బాధితులను స్థానికులు వెంటనే జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు..

# ఇంజనీరింగ్ విద్యలో క్వాంటమ్ కంప్యూటింగ్ అవసరమా.... ?

**- డా. ముచ్చుకోట సురేష్ బాబు, విద్య పరిరక్షణ కమిటీ**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** క్వాంటమ్ టెక్నాలజీల్లో ప్రపంచవ్యాప్తంగా బిలియన్ల డాలర్ల పెట్టుబడులు పడుతుండగా, తదుపరి కంప్యూటింగ్ విప్లవంలో నాయకత్వం సాధించాలని ప్రభుత్వాలు పరుగులు పెడుతున్న నేపథ్యంలో, విద్యావేత్తల మధ్య తీవ్ర చర్చ జరుగుతోంది. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ వంటి సాంప్రదాయ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లను తగ్గించి, అన్ని ఇంజినీరింగ్ విద్యార్థులకూ క్వాంటమ్ కంప్యూటింగ్‌ను తప్పనిసరి సబ్జెక్టుగా చేయాలా? భవిష్యత్తు క్వాంటమ్-సిద్ధమైన గ్రాడ్యుయేట్లు కోరుకుంటోందని కొందరు వాదిస్తున్నారు. మరికొందరు ఇది అకాలికం, విధ్వంసకరం, విద్యార్థులు-పరిశ్రమలకు హానికరమని హెచ్చరిస్తున్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ అనగా క్వాంటమ్ మెకానిక్స్ సూత్రాలైన సూపర్‌పొజిషన్, ఎంటాంగిల్‌మెంట్‌లను ఉపయోగించి, క్విట్స్ ద్వారా సమాచారాన్ని ప్రాసెస్ చేయడం. ఒకే సమయంలో 0, 1 లేదా రెండూ కాగలిగే క్విట్స్ వల్ల కొన్ని సమస్యలను సాధారణ కంప్యూటర్ల కంటే ఎక్స్‌పోనెన్షియల్ వేగంతో పరిష్కరించవచ్చు. మందుల ఆవిష్కరణ, క్రిప్టోగ్రఫీ, ఆప్టిమైజేషన్ వంటి రంగాల్లో ఇది విప్లవాత్మక మార్పులు తెస్తుందని ఆశిస్తున్నారు. ఐబీఎం, గూగుల్, ఐఆన్ క్యు, రిగెట్టి, సై క్వంటం, వంటి సంస్థలు క్విట్స్ సంఖ్య పెంచుతూ, ఎర్రర్ కరెక్షన్ మెరుగుపరుస్తున్నాయి. కానీ వాణిజ్యపరంగా విస్తృతంగా ఉపయోగపడే ఫాల్ట్-టాలరెంట్ క్వాంటం కంప్యూటర్లు ఇంకా సంవత్సరాల దూరంలో ఉన్నాయి. డిసెంబరు 2025 నాటికి క్వాంటమ్ ఉద్యోగ మార్కెట్ చిన్నదైనా, వేగంగా వృద్ధి చెందుతోంది. 2025 మొదటి తొమ్మిది నెలల్లోనే $1.25 బిలియన్ పైగా వెంచర్ ఫండింగ్ వచ్చింది. గత ఐదేళ్లలో ఉద్యోగ ప్రకటనలు 180-500 పెరిగాయి. జీతాలు ఆకర్షణీయంగా ఉన్నాయి - అమెరికాలో ఎంట్రీ-లెవెల్ ఉద్యోగాలు $120,000-$170,000 నుంచి మొదలవుతాయిబీ సీనియర్ ఉద్యోగులకు $250,000 దాటుతాయి. 2030 నాటికి 2.5 లక్షల ఉద్యోగాలు, 2035 నాటికి $1 ట్రిలియన్ ఆర్థిక ప్రభావం వస్తుందని అంచనా. అయినా, నైపుణ్యం ఉన్న వారు చాలా తక్కువబీ ఉద్యోగ ఖాళీలు-అర్హుల నిష్పత్తి 3:1 గా ఉంది. ఈ నైపుణ్య కొరత కారణంగా క్వాంటమ్ విద్య విస్తృతంగా చేర్చాలనే డిమాండ్ పెరిగింది. ఎంఐటీ, స్టాన్‌ఫోర్డ్, ఐఐటీలు ఇప్పటికే క్వాంటమ్ కంప్యూటింగ్‌ను అడ్వాన్స్‌డ్ ఎలక్టివ్ లేదా స్పెషలైజేషన్‌గా అందిస్తున్నాయి. చైనా, సింగపూర్, కెనడా, భారత్ (2023 నేషనల్ క్వాంటమ్ మిషన్ ద్వారా) సాంప్రదాయ బ్రాంచ్‌లను తొలగించకుండానే క్వాంటమ్ విద్యను పెంచుతున్నాయి. ప్రపంచంలో ఎక్కడా ప్రతిష్ఠిత సంస్థ సాంప్రదాయ బ్రాంచ్‌ల స్థానంలో క్వాంటమ్‌ను తప్పనిసరి చేయలేదు. క్వాంటమ్‌ను తప్పనిసరి చేయాలనే వాదనలు: కనీస అవగాహన (క్విట్స్, సూపర్‌పొజిషన్, ఎంటాంగిల్‌మెంట్, షార్/గ్రోవర్ అల్గారిథమ్స్) భవిష్యత్తుకు సిద్ధం చేస్తుందని, 1-2 క్రెడిట్ తేలికైన కోర్సు సరిపోతుందని అంటారు. ఎలక్టివ్ లేదా బలమైన సాంప్రదాయ బ్రాంచ్‌లతో పాటు ఉంటే ఇది ఉత్తమమే. కానీ సాంప్రదాయ బ్రాంచ్‌లను తగ్గించి అందరికీ తప్పనిసరి చేయడం తీవ్ర వ్యతిరేకతకు గురవుతోంది. ఈ రోజు 99% సాంకేతికత (చిప్స్, విద్యుత్ గ్రిడ్‌లు, వాహనాలు, భవనాలు, విమానాలు) ఇంకా సాంప్రదాయ ఇంజినీరింగ్ సూత్రాలపైనే ఆధారపడి ఉంది. ఈ బ్రాంచ్‌లను తగ్గిస్తే నాలుగైదేళ్లలోనే పరిశ్రమలు తీవ్ర నైపుణ్య కొరతను ఎదుర్కొంటాయి. క్వాంటమ్ కంప్యూటింగ్‌కు లీనియర్ ఆల్జీబ్రా, కాంప్లెక్స్ నంబర్స్, ప్రాబబిలిటీ, క్వాంటమ్ మెకానిక్స్ బలమైన పునాది అవసరం. ఈ విషయాల్లోనే చాలా మంది విద్యార్థులు కష్టపడుతుంటే, బలవంతంగా నేర్పిస్తే భారీగా ఫెయిల్యూర్, గుర్తుపెట్టుకోవడం, నిరాశాజనకంగా ఉంటుంది. టైర్-2, 3 కాలేజీల్లో ఫ్యాకల్టీకే కిస్కిట్, సిర్క్ వంటి టూల్స్ అనుభవం ప్రాథమిక అవగాహన లేదు, వీరితో విద్యార్థులకు పాఠాలు బోధించడం అంటే కష్ట సాధ్యమే. ల్యాబ్‌లు నడపడం దాదాపు అసాధ్యం. గతంలో క్లౌడ్ కంప్యూటింగ్ (2010-15), ఏఐయంఎల్ (2018-22) తప్పనిసరి చేసినప్పుడు చాలా కాలేజీల్లో అధ్యాపకులు లేక మూస ధోరణిలో బోధనా సామర్థ్యాలు లేని వారు బోధించడం వలన జోక్ సబ్జెక్టులుగా మిగిలాయి. క్వాంటమ్ కంప్యూటింగ్ ఇంకా కష్టతరమైనది కాబట్టి ఫలితం మరీ దారుణంగా ఉంటుంది. మంచి కళాశాలల్లో, బలమైన సంస్థల్లో సాంప్రదాయ బ్రాంచ్‌లతో పాటు తేలికైన క్వాంటమ్ మాడ్యూల్ విజయవంతమవుతుంది. కానీ బలహీన మైన విద్యావ్యవస్థలో తప్పనిసరి చేయడం విద్యాపరమైన దుర్వినియోగమే. దీనికి సరైన మార్గం, సాంప్రదాయ బ్రాంచ్‌లను బలోపేతం చేస్తూ, అందరికీ తేలికైన అవగాహన కోర్సు, ఆసక్తి ఉన్న టాప్ 10-20 విద్యార్థులకు డీప్ ఎలక్టివ్స్/మైనర్స్ ఇవ్వడం. ఫ్యాకల్టీ శిక్షణ, పునాది విషయాల బలోపేతం, క్రమంగా అమలు - ఇదే హైప్‌ను అధిగమించి నిజమైన సామర్థ్యం తయారుచేసే మార్గం. క్వాంటమ్ కంప్యూటింగ్ నిస్సందేహంగా భవిష్యత్తు. కానీ ఇప్పుడున్న సుస్థిర పునాదులను పడగొట్టి, ఇంకా పరిపక్వం కాని రంగాన్ని అందరిపై రుద్దడం హేతుబద్ధం కాదు. 1995లో "నానోబాట్ సర్జరీ" కోసం మెడికల్ కోర్సు లు రద్దు చేయడం లాగా తయారవుతుంది. కళాశాలలను బలోపేతం చేయకుండా, బోధనా సామర్థ్యాలు మెరుగుపరచ కుండా కేవలం కాగితంపై దార్శనికం - ఆచరణలో విపత్తు ధోరణితో ప్రభుత్వం ముందుకెళితే భవిష్యత్తు అగమ్యగోచరం.

# మిట్ట మల్లేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు

### - ప్రత్యేక అలంకారంలో మిట్టమల్లేశ్వరుడు



**పులివెందుల- సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** పులివెందుల పట్టణంలోని గుంత బజార్ సమీపంలో ఉన్న ఎంతో పురాతనమైన ప్రసిద్ధిగాంచిన శ్రీ మిట్ట మల్లేశ్వర స్వామి ఆలయంలో సోమవారాన్ని పురస్కరించుకొని శ్రీ మిట్టమల్లేశ్వరుని విశేష పూజలు నిర్వ హించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా తెల్లవారుజామున నుండి స్వామి వారికి ప్రధాన అర్చకులు రుద్ర, శివ స్వాముల ఆధ్వ ర్యంలో స్వామివారికి పంచా మృత అభిషేకం, భస్మాభిషేకం, సహస్ర నామ అష్టోత్తర శతనామావళి, భీష్మాభిషేకం, లిం గా ష్టకం తదితర పూజా కైకర్యాల అనంతరం మిట్ట మల్లేశ్వరుడు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శ నమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ చింత కుంటను ధీకర రెడ్డి, నిర్వహకులు మాట్లాడుతూ శివాలయంలో ప్రతిరోజు విశేష పూజలు ధూప, దీప, నైవేద్యాలు, ఘనం గా నిర్వహించడం జరుగుతోందన్నారు. సోమవారాన్ని పురస్కరించుకొని ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పరమశివునికి ఎంతో నమ్మకంతో భక్తి శ్రద్ధలతో మొక్కలు చెల్లించి విశేష పూజలు నిర్వ హించడం జరుగుతుందన్నారు. అనంతరం అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఎండొ మెంట్ సిబ్బంది ఆలయ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

### డిఎం అండ్ హెచ్ఓ కార్యాలయంలో
# ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి



**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** భాషా సంయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేసినటువంటి అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా జిల్లా వైద్య మరి ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి నాగ శేషు భూషణ్ రెడ్డి, కార్యాలయ పరిపాలన అధికారి గిరిజ మనోహర్ రావు, హెచ్ఈఈవో త్యాగరాజు, పీఎంఓ నాగన్న, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి

**పులివెందుల- సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో "అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి" కార్యక్రమం సోమవారం డిసెంబర్ 15న జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్. ఎమ్. మాధవ, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు 'పొట్టి శ్రీరాములు' చిత్రపటానికి పుష్ప నివాళులు అర్పించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్. ఎమ్. మాధవ మాట్లాడుతూ తెలుగు మాట్లాడే ప్రజలకి ప్రత్యేక రాష్ట్రం కావాలని నిరాహార దీక్ష చేశారని, ఆయన చేసిన త్యాగం చాలా గొప్పదని పేర్కొన్నారు. తన ప్రాణాలను కూడా లెక్కచేయని ఆయన త్యాగం వల్లే తెలుగువారి స్వరాష్ట్ర కల సాకారమై ఆయన అమరజీవిగా కీర్తిని దక్కించుకున్నారని తెలిపారు. తెలుగు ప్రజల హృదయాల్లో పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని తెలిపారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర గురించి కళాశాల విద్యార్థినులు మాట్లాడారు. ఈ కార్యక్రమం సందర్భంగా కళాశాల నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన పలువురు విద్యార్థినులకు అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్. మాధవ చేతులు మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్. ఎమ్. మాధవ, స్టూడెంట్ యాక్టివిటీ అధికారి డాక్టర్ కీర్తి రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ జయమ్మ, డాక్టర్ రాజేష్, డాక్టర్ సాయి శ్రీనివాస్, ఎన్.వి. సుబ్బారెడ్డి, కె.సుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

### విశ్రాంత ఉపాధ్యాయుడు ఈశ్వర్ రెడ్డికి
# నివాళులర్పించిన శ్రీకాంత్ రెడ్డి



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** మండలంలోని టౌన్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పొట్టిపాటి ఈశ్వర్ రెడ్డి (85) అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న వైయస్సార్సీపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి స్థానిక ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి తో కలిసి ఈశ్వర్ రెడ్డి భౌతిక కాయానికి నివాళు లర్పించారు. ఈశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, సర్పంచ్ వెంకట నారాయణ రెడ్డి, మైనార్టీ నాయకులు చాన్ బాషా, లక్ష్మి రెడ్డి, విశ్వనాథ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# గ్రామాలలో కోర్ కమిటీ సమావేశం

## - మండల అధ్యక్షుడు దేవి రెడ్డి శ్రీకాంత్ రెడ్డి




**సింహాద్రిపురం- సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** సింహాద్రిపురం మండలం కోవరగుంట పల్లి గ్రామంలో కోర్ కమిటీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి సూచనలు మేరకు సోమవారం మండల అధ్యక్షుడు దేవి రెడ్డి శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన వజ్ర భాస్కర్ రెడ్డి (అబ్జర్వర్లు )సోమల చెన్నకేశవరెడ్డి, లోమల పవన్ కుమార్ రెడ్డి, శివారెడ్డి, బిఎన్ బ్రహ్మానంద రెడ్డిలు గ్రామ ప్రజల ఆధ్వర్యంలో కోర్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ కలసి కట్టుగా పనిచేస్తే విజయం సాధించవచ్చునని, ముందుగా గ్రామంలోని సమస్యలను వారిని అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా కమిటీ బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి అన్నారు. కమిటీలతోనే కూటమి ప్రభుత్వ కుట్రలను తిప్పి కొట్టొచ్చు అన్నారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి కూటమి వైఫల్యాన్ని ప్రజలకు వివరించా లన్నారు. జగన్మోహన్ రెడ్డి, అవినాష్ రెడ్డి నాయకత్వంలో ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేస్తే ఫలితం దక్కుతుంద న్నారు. 2029లో జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో గెలిపి ధ్యేయంగా ప్రతి నాయకుడు కార్యకర్త సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వర రెడ్డి, ఆదినారాయణ, గోపాల్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, గంగాధర్ రెడ్డి, సీలర్, పండు మాబు, రహంతుల్లా, ఖాజా, సోమయ్య, జయకుమార్ రెడ్డి, ఐటీ విభాగం గోవర్ధన్ రెడ్డి, సోషల్ మీడియా విభాగం ముల్లా బిలాల్, బలపనూర్ ఖలీల్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ అభివృద్ధి, బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలి

## - గ్రామ కమిటీలే పార్టీకి పట్టుగొమ్మలు



**వేముల - సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** వేముల మండలం వేల్పుల గ్రామ పంచాయతీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీలు కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వజ్ర భాస్కర్ రెడ్డి, వేముల మండల కన్వీనర్ నాగేళ్ళ సాంబ శివారెడ్డి, మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డి (వేల్పుల రాము) వేల్పుల గ్రామ పంచాయతీ గురించి రాము అన్న ప్రసంగం చాలా అద్భుతంగా ఉంది ...వేల్పుల, బెస్తవారిపల్లె గ్రామాలకు సంబంధించినటువంటి వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ గ్రామ కమిటీలే పార్టీకి పట్టుకొమ్మలని ఈ కమిటీల ద్వారా నియామకమైన పదవుల పట్ల అంకిత భావం కలిగి బాధ్యతగా పని చేయాలన్నారు. దీంతో పాటు ప్రజల్లోకి పార్టీ క్రియాశీలక విధి విధానాలు తదితర అంశాలపై పటిష్టంగా అమలు చేయాలని ఆయన కోరారు. ప్రతి ఒక్కరూ పార్టీ అభివృద్ధి, బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని మండల నాయకులు కార్యకర్తలు కష్టపడి పని చేస్తేనే మునుముందు మన పార్టీ గెలుపొందేల కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వేముల మండల వైకాపా నాయకులు, గ్రామ ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

## - మున్సిపల్ కమిషనర్ రాముడు

**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 15 :** పులివెందుల పట్టణ పరిధిలో వివిధ పాఠశాలలలో నిర్వహించు ఆధార్ స్పెషల్ క్యాంపులను విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని పులివెందుల పురపాలక కమిషనర్ రాముడు పేర్కొన్నారు. సోమవారం పత్రికలకు అందించినటువంటి సమాచారం మేరకు భారతదేశంలో ఆధార్ ఒక గుర్తింపు కార్డుగా ఉన్నందున ఆధార్ కార్డుతో ప్రజలు అనేక రకాలు పొందుతున్న నేపథ్యంలో బయోమెట్రిక్, డాక్యుమెంటేషన్ అప్డేట్ మరింత అవసరమైన నేపథ్యంలో డిసెంబర్ 16 నుండి 24 వరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలను విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగపరచు కోవాలన్నారు. 16, 17, 18 తేదీలలో స్వామి వివేకానంద స్కూల్లో, 19, 20 తేదీలలో నాగార్జున హై స్కూల్లో, 22, 23, 24 తేదీలలో నివేదిత స్కూల్లో నిర్వహించబడును తెలియజేశారు.



# అరటి ధరకు రెక్కలు- సీమ రైతుకు ఊరట

- అరటి రైతులకు ఇప్పుడు గిట్టుబాటు ధర
- కూటమి ప్రభుత్వం రాజకీయాల కంటే రైతుల సమస్యను పరిష్కరించడంపై దృష్టి





**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 15 :** మార్కెట్లో అరటి ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం పులివెందుల మార్కెట్లో టన్ను అరటి గరిష్టంగా 16 నుంచి 17 వేల రూపాయలకు అమ్ముడవుతోంది. నాణ్యత లేని బనానా టన్నుకి 10 వేల ధర పలుకుతోంది. ఈ ఏడాది మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో అరటి సాగు భారీగా పెరిగింది. మంచి వర్షాలు పడటంతో.. దిగుబడి కూడా బాగా వచ్చింది. ఈ పరిస్థితుల్లో రాయలసీమ అరటికి డిమాండ్ తగ్గిపోయింది.

నెల రోజుల క్రితం రాయలసీమలో అరటి ధర కిలో 8 నుంచి 10 రూపాయలు దాటలేదు. లో క్వాలిటీ పండ్ల రేటు కిలో 2 రూపాయల స్థాయికి పడిపోయింది. అరటి ధరలు భారీగా పతనం కావడంతో.. సీఎం చంద్రబాబు రైతుల సమస్యపై దృష్టిపెట్టారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో మార్కెటింగ్ శాఖ అధికారులు.. ఉత్తరాదికి వెళ్లి అక్కడి వ్యాపారులతో చర్చలు జరిపారు. రాష్ట్ర అధికారుల చర్చలు ఫలించడంతో.. నార్త్ ట్రేడర్స్ ఏపీ అరటి కొనడానికి అంగీకరించారు. డిసెంబర్ రెండో వారం నుంచి రాయలసీమ జిల్లాల నుంచి ఉత్తరాదికి అరటి ఎగుమతులు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో 3 లక్షల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో అరటి పంట సాగు చేస్తున్నారు. మొ త్తం 87 లక్షల టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా. ఏపీలో పండిన అరటిలో చాలా వరకు రాష్ట్రంలోనే వినియోగం అవుతుంది. మొత్తం దిగుబడిలో 2 లక్షల టన్నులు ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉత్తరాదిలో సప్లయ్ ఎక్కువగా ఉండటంతో.. మన దగ్గర డిమాండ్ తగ్గింది. నవంబర్లో ధరలు పడిపోయిన తర్వాత.. ఇప్పటి వరకు 70 వేల టన్నుల అరటి కొనుగోళ్లు జరిగాయి. రానున్న రోజుల్లో అరటి ధరలు మరింత పెరుగుతాయని మార్కెటింగ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రేట్లు పడిపోయినప్పుడు పులివెందులలో ఆందోళన చేసిన వైసీపీ అధినేత జగన్‌రెడ్డి.. ప్రస్తుతం రైతులకు మంచి ధర దొరుకుతున్న సమయంలో సైలెంట్‌గా ఉన్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం మాత్రం రాజకీయాల కంటే.. రైతుల సమస్యను పరిష్కరించడంపై దృష్టి పెట్టింది. సర్కారు తీసుకున్న చర్యలు ఫలించడంతో.. అరటి రైతులకు ఇప్పుడు గిట్టుబాటు ధర లభిస్తోందన్నారు.

# ప్రభుత్వం అందిస్తున్న టార్ఫలిన్ పట్టలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 15 : ప్రభుత్వం అందిస్తున్న టార్ఫలిన్ పట్టలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ డాక్టర్ ఎస్.ఎం.డి షఫీనాయక్, ఏపిఎం నిరంజన్‌లు పేర్కొన్నారు. రైతు ఉత్పత్తి దారుల సంస్థ ద్వారా స్వయం సహాయక సంఘంలో ఉన్న రైతులకు రైతు సంఘాలకు ప్రభుత్వం అందించిన టార్ఫలిన్ పట్టలను సోమవారం మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు టార్ఫాలిన్ పట్టలను సరైన విధానంలో వినియోగించుకోవాలన్నారు. మండలానికి 200 టార్ఫలిన్ పట్టలు వచ్చాయని అందులో ఒక్కొక్క పట్ట విలువ 2000 రూపాయలు అని అవసరమైన రైతు వీటిని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. వర్షాకాలంలో పండించిన పంటలు తడవకుండా గడ్డి పైన ఈ పట్టలను ఉపయోగించుకోవచ్చునని అన్నారు. అవసరమైన రైతులు ఈ పట్టలను వెలుగు అధికారుల ద్వారా పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు వెంకటరామరాజు, దళిత వేదిక నాయకుడు ఓబులేసు, మల్లికార్జున నాయుడు, సీసీలు సుబ్బరాయుడు, శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

# రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి : సీపీఐ



**గుత్తి - సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** గుత్తి పట్టణంలోని ఎంఆర్ఓ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి, సిపిఐ రైతు సంఘం ఆధ్వర్యంలో గుత్తి, తహసీల్దార్‌కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. రైతులు పండించిన వరి మొక్కజొన్న పత్తి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, తుఫాన్ వల్ల నష్ట పోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదు కోకపోతే ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించిన సిపిఐ, నియోజకవర్గ సహాయ కార్యదర్శి, రమేష్, పట్టణ కార్యదర్శి రాజు యాదవ్. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సహాయ కార్యదర్శి, రమేష్ బాబు, పట్టణ కార్యదర్శి రాజు యాదవ్, మండల సహాయ కార్యదర్శి మధు, పట్టణ సహాయ కార్యదర్శి నజీర్, సీనియర్ నాయకులు షఫీ, డానియల్, టియం బాషా, మౌలాలి, భాస్కర్, ఆదినారాయణ, షేక్షావలి, ఆటో రాజు తదితరులు పాల్గొన్నారు.



# ముగిసిన టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్

## - విజేతగా పెద్దమండ్యం జట్టు

**మదనపల్లె - సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** మదనపల్లి డివిజన్ టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్ గత మూడు రోజులుగా మదనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శ్రీ వేద పాఠశాలలో జరుగుతున్నాయి. ఇందులో చివరి రోజు సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మదనపల్లెలో మదనపల్లి, పెద్దతిప్ప సముద్రం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో పెద్దతిప్ప సముద్రం జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. శ్రీ వేద పాఠశాలలో జరిగిన రెండవ సెమీఫైనల్ లో రామసముద్రం, పెద్దమండ్యం జట్ల మధ్య మ్యాచ్ జరగగా పెద్దమండ్యం జట్టు విజయం సాధించింది. ఫైనల్స్‌లో పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం జట్లు తలపడగా పెద్దమండ్యం జట్టు విజేతగా నిలిచింది. జిల్లా స్థాయిలో జరిగే టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్లో మదనపల్లె డివిజన్ జట్టుగా పెద్దమండ్యం జట్టు అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొననుందని మదనపల్లి ఉప విద్యాశాఖ అధికారి లోకేశ్వర్ రెడ్డి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజు తెలిపారు. విజేతలకు మదనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయులు రమా, నందాలు బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి డివిజన్ కోఆర్డినేటర్ భద్రయ్య, శివశంకర్, మండల విద్యాశాఖ అధికారులు రాజ గోపాల్, నారాయణ, రామకృష్ణ వ్యాయామ ఉపాధ్యాయులు నరేష్, అన్సర్, రమేష్, శ్రీనివాసులు, శివశంకర్, మనీ, పార్థసారథి, విజయ్ కుమార్, లతా, మహేంద్ర నాయక్, కిరణ్, రెడ్డి వరప్రసాద్ పాల్గొన్నారు.

## ఈనెల 17న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో

# ఘనంగా సెమీ క్రిస్మస్, షర్మిలమ్మ జన్మదిన వేడుకలు

## - షేక్ సైదా డీసీసీ అధ్యక్షులు ప్రకాశం జిల్లా



**ఒంగోలు - సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** ఈనెల 17వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలను, అలాగే పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్ తో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించను నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్ర మానికి రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకు లు నియోజకవర్గ సమన్వయకర్తలు, నగర, మండల ,పట్టణ పార్టీ అధ్యక్షులు, పార్టీ జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు పార్టీ ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని సైదా కోరారు.

# బంగారంగడోళ్ల...వికృతకాండ

- రియల్ ఎస్టేట్లో వీళ్లదే హవా...
- మేనకూరులో మెగా వెంచర్లు కూడా వీళ్లవే
- చుట్టూ గోడలు..రైతుల గోడులు..
- రియల్టర్ల ధన దాహానికి బలవుతున్న వ్యవసాయదారుడు
- వర్షాకాలంలో రైతుల బాధ వర్ణనాతీతం



వ్యవసాయదారుడు అంతరించిపోతున్న తరుణంలో లేఔట్ల పేరుతో అరాకొరా ఉన్న రైతన్నలను సైతం.. అదిమేస్తున్నారు వారి ఆశయాలను చిదిమేస్తున్నారు. లే అవుట్ చుట్టూ గోడలను నిర్మించడం వలన వర్షపు నీరు ఎటు వెళ్లాలో తెలియక వ్యవసాయ భూములను ముంచేస్తున్నాయి. పోనీ ఈ వ్యవసాయ భూములకు గృహాలు కనుకూలంగా మార్పిడి (కన్వర్షన్) అనుమతులు.. తుడా నుండి ఆమోదాలు(అప్రూవల్స్) ఉన్నాయా అంటే అదీ లేదు. కేవలం పారిశ్రామిక అభివృద్ధిని అడ్డం పెట్టుకొని మేనకూరులో రియాల్టర్ల రియల్ దందా... ఒక పెద్ద మాఫియా సామ్రాజ్యాన్ని గుర్తుచేస్తుంది.

**నాయుడుపేట– సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణానికి సమీపంలో ఉన్న మేనకూరు గ్రామానికి ఒకప్పుడు మండల చిత్రపటంలో మాత్రమే చోటు ఉండేది.. కానీ నేడు దేశవ్యాప్తంగానే కాకుండా కొన్ని విదేశాలలో కూడా గుర్తింపు తెచ్చుకుంది ఇందుకు కారణం. మేనకూరు పారిశ్రామిక వాడగా ఏర్పడడం... అనేక పరిశ్రమలు ఇక్కడకు రావడం.. దీంతో అప్పట్లో వేలల్లో కూడా కొనుగోలు చేయని ఎకరం పొలం ఇప్పుడుకోట్లల్లో పలుకుతుంది మేనకూరులో.. ఒకప్పుడు. వీధి దీపాలు కూడా సరిగ్గా లేని మేన కూరులో.. పరిశ్రమల పుణ్యమా అంటూ నేడు విద్యుత్ కాంతులతో శోభాయామానంగా వెలుగుతుంది..

అంతేకాకుండా దేశం నలుమూలల నుండి పరిశ్రమల్లో ఉద్యోగాల కోసం వేల మంది కార్మికులు మేనకూరుకు వచ్చి నివసిస్తున్నారు.. దీంతో పారిశ్రామికంగా మేనకూరు దినదిన అభివృద్ధి పథంలో నడుస్తుంది.. అంతేకాకుండా రాష్ట్రం నలుమూలల నుండి కూడా ఇక్కడ భూములు కొనుగోలు చేయడానికి ఎంతోమంది ఎగబడుతున్నారు... దీంతో భూములకు రెక్కలొచ్చాయి...భారీగా రేట్లు పెరిగాయి... ఇక ఇదే అదునుగా భావించి నాయుడుపేటలో కొంతమంది అరకొర అనుమతులతో లేఔట్లు వేయడం ప్రారంభించారు... కొనుగోలుదారులను ఆకర్షించడానికి వీరు చేసే అడ్డగోలు వ్యాపారం అంత ఇంతా కాదు... చుట్టూ వ్యవసాయ పొలాలు ఉన్నా కూడా వీరి లేఔట్లకు.. మాత్రం గోడలను నిర్మించి.. రైతుల కంట కన్నీరు పెట్టిస్తున్నారు. మేనకూరు నుండి యర్రపశెట్టి కండ్రికకు వెళ్లే దారిలో నాయుడుపేటకు చెందిన ఒక బంగారు దుకాణదారుడు.. వేసిన లేఔట్ల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించడంతో.. దాన్ని చుట్టప్రక్కల ఉన్న వ్యవసాయ పొలాలలో వర్షాకాలంలో నీరు చేరిపోయి ఎటు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది అంతేకాకుండా దానిని ఆనుకొని ఒక కాలనీ కూడా ఉండడంతో సదరు కాలనీ ముంపుకు గురైయ్యే ప్రమాదం ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని అనుమతులు ఇవ్వవలసిన రెవిన్యూ అధికారులు మాత్రం చేతులు తడుపుకోవడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నారనే విమర్శలు కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది.. ఎవరెలా పోతే మాకేం అంటూ రియల్టర్లు కూడా తమ భూములను కొనుగోలుదారులకు అంటగట్టేస్తున్నారు.. చట్టాలను వాళ్లేస్తున్న లేఔట్ బురదలో తొక్కుతూ...అధికారులను అవినీతికి అలవాటు చేస్తున్నారు.. ప్రజల ధన, ప్రాణాలతో చెలగాటమాడటానికి.. అధికారులను భాగస్వాములను చేస్తూ బంగారంగడోళ్ల.. వికృత కాండపై.. సూర్య వాస్తవం దినపత్రికలో వరుస కథనాలతో మీ ముందుకు...





# డిప్యూటేషన్ల కొనసాగింపుపై సర్వత్రా విమర్శలు

- ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండా పదుల సంఖ్యలో డిప్యూటేషన్లు...!
- అవసరానికి మించి డిప్యూటేషన్ల కొనసాగిస్తున్న డి.సి.హెచ్.ఎస్....?
- గడువు ముగిసినా...... కొనసాగిస్తున్నారని విమర్శలు

**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** జిల్లాలో డి.సి.హెచ్.ఎస్ కార్యాలయం వివాదాలకు నిలయంగా మారింది. రాష్ట్రంలో డిప్యూటేషన్లు నిషేధం అమలులో ఉన్నప్పటికీ జిల్లాలో మాత్రం అంటువంటి ఆదేశాలు పట్టించుకోకుండా డిప్యూటేషన్ల కొనసాగింపు తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది . విధుల లో జాప్యం ఉండకుండా ఉండటానికి ప్రభుత్వం బదిలీలు పూర్తి చేసినప్పటికీ కొందరు వ్యక్తులు కాసుల వర్షం కురిపించి వారికి నచ్చిన చోట పోస్టింగ్ ఆర్డర్ తో డిప్యూటేషన్ కొనసాగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి . ఆర్డర్ యొక్క నిర్ణీత గడువు ముగిసినా కూడా కొందరి తో డబ్బులు వసూలు చేసి డిప్యూటేషన్ కొనసాగిస్తున్నారు అనే పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లాలో మొత్తం ఎంతమంది డిప్యూటేషన్ లో ఉన్నారు వారిలో మినిస్టీరియల్ సిబ్బంది ఎవరు, అటెండర్లు, సవర్డినేట్స్ ఎవరు, పారామెడికల్ సిబ్బంది ఎవరు అనేది లెక్కటేలడం లేదు.




వీరందరికీ జిల్లా కలెక్టర్ మరియు రాష్ట్ర సెకండరీ హెల్త్ డైరెక్టర్ యొక్క అనుమతులు ఉన్నాయలేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. జిల్లా స్థాయి అధికారి డిప్యూటేషన్లను కొనసాగిస్తుండడం పై అనేక అనుమానాలు దారి తీస్తున్నాయి. డిప్యూటేషన్లను కొనసాగించి వ్యక్తిగత ప్రయోజనాలు పొందుతున్నారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి డిసిహెచ్ఎస్ గాని, అధికారిక వర్గాల గాని స్పందన ఇంకా వెలువడలేదు. డిప్యూటేషన్ల కొనసాగింపు ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ఉందా? లేక ఆ ప్రక్రియలో ఏవైనా లోపాలున్నాయా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. అధికారులు ఈ విషయంపై దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంది. త్వరలోనే సంబంధిత అధికారుల వివరణ లేదా ప్రభుత్వ సూచనలు వెలువడే అవకాశం ఉంది.

# సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో నీటి కష్టాలు..

- రెండు రోజులుగా నిలిచిన సరఫరా..?
- రోగుల అవస్థలు
- అధికారులు స్పందించండి...!



**అనంతపురం వైద్యం – సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** అనంతపురం జిల్లా కేంద్రంలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో నీటి కష్టాలు తీవ్రతరమవుతున్నాయి. ఆసుపత్రిలో రెండు రోజుల నుంచి నీటి సమస్య ఏర్పడింది. దీంతో నిత్యం వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే రోగులు, ఇనపేషంట్లు, వారి సహా యకులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు.వారితో పాటు ఆసుపత్రి వైద్యులు, నర్సులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఆసుపత్రి లో ల్యాబ్,



క్లీనింగ్, మరుగుదొడ్ల వినియోగం, తదితర అవసరాలకు నీరు అవసరమవుతుంది.దీంతో ఆసుపత్రిలో నీటి ఎద్దడి నెలకొని మరుగుదొడ్లకు, తిన్న చేతులు కడుక్కోడానికి నీటి సరఫరా లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వార్డుల్లో నర్సులు తమ డ్యూటీ తాము చేస్తూ.. సమయానికి రోగులకు మెడిసిన్, వైద్యం అంది స్తున్నా.. నీటి కష్టాలతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని రోగులు, వారి తరఫున అటెండర్స్ కోరుతున్నారు.



# ఘనంగా శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు

- ఎరుకల డెవలప్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

రాయచోటిలో ఎరుకుల కులం ఆత్మీయ సమావేశం



**రాయచోటి– సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణం మాసాపేటలోని ఒక ప్రైవేట్ కళ్యాణ మండపంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ ఎరుకుల డెవలప్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎరుకుల గిరిజనుల ఆత్మీయ సమావేశం విజయవంతం అయ్యింది. ఈ సమావేశంలో ఏరుకుల డెవలప్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పూజారి రెడ్డి శేఖర్ మాట్లాడుతూ ఎరుకుల కులస్తులు ఎదుర్కొంటున్న విద్య, వైద్యం, ఉపాధి సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ కేసులపై చర్చ జరిగిందన్నారు. ప్రభుత్వ స్కాలర్షిప్లు, ఆరోగ్య భద్రత, మహాత్మా జోతి బావులు, ఐటీడీఏ పథకాలు సమర్థవంతంగా అమలు చేయాలని,అట్రాసిటీ కేసుల్లో దర్యాప్తు, న్యాయం వేగవంతం చేయాలి, కలెక్టర్లు, ఎస్పీలు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు బాధ్యతలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ఎరుకుల డెవల ప్మెంట్ అసోసియేషన్ ప్రభు త్వాన్ని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతోందన్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఎరుకుల డెవలప్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ, తదితర సంఘ నాయకులు, కుల పెద్దలు పాల్గొన్నారు.

# శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగాలపై వ్యాసరచన పోటీలు



**నాయుడుపేట – సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా సోమవారం నాయుడుపేట పట్టణంలోని ఎల్ఏ సాగరం జడ్పీ హైస్కూల్లో ఆయన త్యాగాలను గుర్తు చేసుకుంటూ మండల స్థాయి వ్యాసరచన పోటీలను నిర్వహించారు. తెలుగువారి స్వరాష్ట్ర సాధన కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి శ్రీ పొట్టి శ్రీరాములు డిసెంబర్ 15న అశువుల బాసిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పొట్టి శ్రీరాములు వర్ధంతి నేపద్యంలో నాయుడుపేట పట్టణంలోని ఎల్ఏ సాగరం జడ్పీ హైస్కూల్లో ఆయన త్యాగాలపై మండల స్థాయి విద్యార్థులకు వ్యాసరచన,వక్తృత్వం, క్విజ్ పోటీలను నిర్వహించినట్లు పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. క్విజ్ పోటీల్లో యదిత్య, ఉపజ్ఞ ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. వకృత్వ పోటీల్లో సాయి మనోజ్ ప్రథమ బహుమతి, వ్యాసరచన పోటీల్లో యోజన శ్రీ తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. గెలుపొందిన వారికి ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గడదాసు వెంకటేశ్వర్లు, ఆనంద్, సుధాకరయ్య, కందనూరు రాఘవేంద్ర, చెంచు కుమార్, శ్రావణి, అమృతవల్లి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించిన ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్



**నాయుడుపేట – సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి సందర్భంగా నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జి ఉయ్యాల ప్రవీణ్ స్థానిక జనసేన పార్టీ నాయకులతో కలిసి ఘన నివాళులు అర్పించారు. సోమవారం నాయుడుపేట బస్టాండ్ వద్ద ఉన్నటువంటి అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం ఉయ్యాల ప్రవీణ్ మాట్లాడారు. తెలుగు ప్రజల స్వాభిమానానికి ప్రతీకగా నిలిచిన శ్రీపొట్టి శ్రీరాములు త్యాగం వల్లనే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం సాధ్యమైందన్నారు. ఆయన చేపట్టిన నిరాహార దీక్ష దేశ రాజకీయ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిందన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని, ప్రజల కోసం త్యాగం చేయడమే నిజమైన దేశభక్తి అని ఆయన చాటిచెప్పారని ఉయ్యాల ప్రవీణ్ పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జనసేన పార్టీ నాయకులు అట్ల కృష్ణారావు, నాయకులు బాలు శెట్టి, కుంపటి శ్రీనివాసులు, జ్యోతిష్, వీర మహిళలు రోహిణి, సల్మా, హేమ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ ఓటమే ధ్యేయంగా పని చేస్తాం

**- టీడీపీ మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి**



**వేంపల్లె – సూర్య వాస్తవం, డిసెంబర్ 15 :** పులివెందుల నియోజకవర్గంలో వైసీపీ ఓటమే ధ్యేయంగా పని చేస్తామని టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపికి చెందిన అడ్వకేట్ ఈశ్వరరెడ్డితో పాటు ఇతర నేతలు టిడిపిలోకి చేరుతామని ఆహ్వానించడంతోనే అమ్మగారిపల్లెకు వెళ్లామని చెప్పారు. బిటెక్ రవికి షాక్, సెగ అని వైసీపీ నేతలు చెప్పడం శోచనీయం అన్నారు. వేంపల్లెలో ఉన్న వైసీపీ నేత గతంలో 5 సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి కూడ అమ్మగారిపల్లెలో ఒక ఎజెంట్ ను కూడ పెట్టుకోలేని పరిస్థితి అ నాయకుడిది అన్నారు. అమ్మగారిపల్లెలో ఎన్ని ఓట్లు ఉన్న విషయం కూడ తెలియకక పోవడం దురదృష్టకరం అన్నారు. టిడిపి నేతలు అ గ్రామానికి వెళ్ళడంతో వందల కుటుంబాల ప్రజలు బయటికి వెళ్లి పోవడం జరిగిందని చెప్పడం వైసీపీ నేత అవివేకానికి నిదర్శనం అన్నారు. అమ్మగారిపల్లెలో ఉన్నవి 70 కుటుంబాలు మాత్రమేనని అ విషయాన్ని వైసీపీ నేత గ్రహించాలని కోరారు. వేంపల్లెకు కూత వేటు వేసే దూరంలో ఉన్న అమ్మగారిపల్లెలో గతంలో ఏజెంట్లును పెట్టుకోలేని పరిస్థితి ఉండడంతో పాటు టిడిపికి ఒక ఓటు కూడా రాలేదని చెప్పారు. బిటెక్ సారధ్యంలో 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి కంచుకోట అయిన అమ్మగారిపల్లెలో టిడిపి తరుపున ఎజెంట్లను పెట్టి 40 ఓట్లు సాధించడం జరిగిందని చెప్పారు. ప్రస్తుతం లాయర్ ఈశ్వరరెడ్డి టిడిపిలోకి రావడంతో 80 ఓట్లు సాధిస్తామని చెప్పారు. తన స్వార్థం టిడిపిలో నుండి వైసీపీ పార్టీలోకి వెళ్లినాడని ప్రజలు అందరూ గ్రహిస్తున్నారని చెప్పారు. స్వార్థంతో కొంత మంది పార్టీని మారుతున్నారని వైసీపీ నేత మాట్లాడం శోచనీయం అన్నారు. వైసీపీ నేతలే అమ్మగారిపల్లె గ్రామ ప్రజలను భయపెట్టి విందు కోసం వేరే ప్రాంతానికి తరలించారని చెప్పారు. దేశ సేవా కోసమో, వేంపల్లి అభివృద్ధి కోసమో పార్టీ మారావా అని ప్రశ్నించారు. 17 వ తేదిన వేంపల్లెలో దిల్ మ్యాగే టిడిపి పార్టీలో చేరుతున్నాడని ర్యాలీ కూడ పెట్టామని దమ్ము ఉంటే నీ చేతనైతే వేంపల్లెలో కూడ ప్రజలకు వేరే చోటికి పంపించి బీగాలు వేయించాలని సవాల్ విసిరారు. విలేకరుల సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్‌లతో పాటు టిడిపి నేతలు పాల్గొన్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు ఆదర్శమూర్తి

**- పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి**



**నెల్లూరు– సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** నెల్లూరు రాంజీ నగర్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిటీ కార్యాలయంలో .. వైఎస్ఆర్సిపి ఆర్యవైశ్య నాయకుల ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్యవైశ్య నాయకులతో కలిసి, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి.. పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో తెలుగు వారు పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములని అన్నారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగానే, తెలుగువారికి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. ఒక లక్ష్యం అనుకుంటే ఆ లక్ష్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా, పోరాటం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. పొట్టి శ్రీరాములు పోరాటం, ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలను, ప్రతి ఒక్కరు, గుర్తుపెట్టుకోవాలన్నారు. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వాసి కావడం, నెల్లూరు జిల్లా ప్రజల అదృష్టం అన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి పొట్టి శ్రీరాములు త్యాగాలకు గుర్తుగా.. నెల్లూరు జిల్లాకు.. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అని నామకరణం చేశారని గుర్తు చేశారు. రాజశేఖర్ రెడ్డి తనయులు వైయస్ జగన్మోహన్ రెడ్డి పొట్టి శ్రీరాములు ఆశయాలకు అనుగుణంగా, నవంబర్ 1 న ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించేలా.. సంస్కరణలు చేపట్టారని తెలిపారు. భవిష్యత్తులో పొట్టి శ్రీరాములు ఆశయాలకు అనుగుణంగా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పనిచేస్తు, ఆర్యవైశ్యులకు అన్ని విధాల ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో 8 వ డివిజన్ కార్పొరేటర్ కామాక్షి దేవి, వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి చీదెళ్ల కిషన్, వైఎస్ఆర్సిపి జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు మంచి కంటి శ్రీనివాసులు, వైఎస్ఆర్సిపి నగర వాణిజ్య విభాగం అధ్యక్షులు జెమిలి శ్రీనివాసులు,వై సి పి వాణిజ్య విభాగం జిల్లా కార్యదర్శి పి. మల్లికార్జున్, ఆర్యవైశ్య నాయకులు పబ్బిశెట్టి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిన ఉచిత వైద్య శిబిరం





**వేంపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 15 :** సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని పురస్కరించుకొని ట్రిబుల్ ఐటీ ఆర్కే వ్యాలీ లోని హాస్పిటల్లో ప్రభుత్వ దంత వైద్య కళాశాల కడప రిమ్స్ వారి డాక్టర్లు, పీజీ విద్యార్థులు ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఆర్జీయూకేటి ఆర్కే వ్యాలీ డైరెక్టర్ ఏ వి ఎస్ ఎస్ కుమారస్వామి గుప్త ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఏవో పి.రవికుమార్, క్యాంపస్ మెయింటెనెన్స్ కోఆర్డినేటర్ ఆర్ పవన్ కుమార్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ జయ దీప్తి, దంత వైద్యశాల డాక్టర్లు ఎం జోష్ణ, డాక్టర్ సుశాంతి, డాక్టర్ దశరథ, డాక్టర్ శేషారెడ్డి మరియు ఎన్ఎస్ఎస్ యూనిట్ 7,9 విద్యార్థిని విద్యార్థులు మరియు ఆర్కే వ్యాలీ హాస్పటల్ సిబ్బంది డాక్టర్ ప్రభాకర్ రెడ్డి మరియు డాక్టర్ సంతోష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సుమారు వెయ్యి మంది విద్యార్థినీ విద్యార్థులు ఉచితంగా చికిత్స పొందాలని డైరెక్టర్ తెలిపారు ఈ కార్యక్రమం మంగళవారం నాడు కూడా నిర్వహించబడునని కావున చుట్టూ ప్రక్కల ఉన్న అటువంటి గ్రామ ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్మెంట్‌పై అవగాహన




**వేంపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** సోమవారం వేంపల్లి మండల ప్రజా పరిషత్ సభా భవనంలో ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్మెంట్ సిస్టంలో భాగంగా యూనిఫాడ్ ఫ్యామిలీ సర్వే పై మాస్టర్ ట్రైనర్ అయిన సి.నాగరాజు వేంపల్లి మండల సచివాలయ సిబ్బంది అందరికీ ట్రైనింగ్ ఇచ్చారు. ఈ సర్వే ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతన శకం ప్రారంభమవు తుందని భవిష్యత్తులో ప్రజలు అన్ని రకాలసంక్షేమ పథకాలను, ప్రభుత్వ ఆర్థిక ప్రయోజనాలను సబ్సిడీలను పొందడానికి పరిపాలనలో పారదర్శకత్వం పరిపాలనలో పారదర్శకత తీసుకురావడానికి ఈ సర్వే ఉపయోగపడుతుందని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ప్రజల ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలని ఇది చాలా ముఖ్యమైన సర్వే అని భవిష్యత్తులో ప్రజలు అన్ని రకాల సంక్షేమాలు పొందడానికి ఇది చాలా ఉపయోగపడుతుందని మండల ఎంపీడీవో సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు.

## గ్రంథాలయం ఛైర్మన్‌కు ఘన సన్మానం



**అనంతపురం – సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయం సంస్థ ఛైర్మన్‌గా ఎంపికైన తెలుగుదేశం పార్టీ వడ్డెర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్, వడ్డే వెంకట్‌ని అనంతపురం నగరంలో తన నివాసం లో మర్యాదపూర్వ కలిసి పుష్పగుచ్ఛం అందించి శ్యాలువా కప్పి ఘనంగా అభినందనలు తెలియజేశారు. ముఖ్యంగా నారా చంద్ర బాబు, మంత్రి నారా లోకేష్‌కి పార్టీ అధ్యక్షులు పళ్ళ శ్రీనివాస్‌కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మైనారిటీ నాయకులు షౌకత్ ఖాన్, మహబూబ్ బాషా, మాసూద్వాలి తదితరులు పాల్గొన్నారు.

## మహిళల రక్షణపై అవగాహన



**గుత్తి – సూర్య వాస్తవం, డిసెంబర్ 15 :** గుత్తి మండలంలో జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు గుంతకల్ డీఎస్పీ శ్రీనివాసులు, అనంతపురం మహిళ పోలీస్ స్టేషన్ డిఎస్పి మహ బూబ్ బాషా ఉత్తర్వులు మేరకు గుత్తి సీఐ రామారావు, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, శక్తి టీమ్‌తో కలిసి గుత్తి మండలంలో ఉన్నటువంటి కరిడికొండ గ్రామంలోని స్కూల్లో, గుత్తి టౌన్‌లో ఉన్న కేజీబీవీ స్కూల్, కాలేజ్‌లో అదేవిధంగా గుత్తి టౌన్‌లోని అమృత్ సినిమా హాల్ వెనకాల ఉన్న ఎస్సి కాలనీలో మహిళలతో సమావేశమై మహిళల రక్షణ గురించి, పోక్సో చట్టం, ఎస్సీ, ఎస్టీ చట్టాలు, డయల్ 100 ప్రాముఖ్యత గురించి, సైబర్ మోసాల గురించి వివరించారు.

## పౌర సరఫరా గోడౌన్‌పై ఆకస్మిక తనిఖీ

**- ప్రజలకు చేరే సరుకుల్లో నాణ్యత లోపించకూడదు**

**- ఏయంసి ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్**



**నాయుడుపేట– సూర్య వాస్తవం, డిసెంబర్15:** నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని పౌర సరఫరా శాఖ గోడౌన్‌ను ఏయంసి ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ ఆదివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద యం 8 గంటలకు గోడౌన్‌కు చేరుకున్న ఆయన, రేషన్ దుకాణాలు, పాఠశాల విద్యార్థులు, అంగన్వాడీ కేంద్రాలు, గర్భిణులకు పంపిణీ అవుతున్న సరుకుల నిల్వలు, నాణ్యత, భద్రత అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అందిస్తున్న నాణ్యమైన సరుకులు మధ్యలో ఎక్కడా నాణ్యత కోల్పోకుండా అర్హులకు చేరేలా అధికారులు, సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని ఛైర్మన్ స్పష్టం చేశారు. సరుకుల నిల్వ విధానం, రికార్డుల నిర్వహణ, పంపిణీ ప్రక్రియలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఉయ్యాల ప్రవీణ్ మాట్లాడుతూ, "ప్రభుత్వం ప్రజల కోసం అందిస్తున్న ప్రతి సరుకు చివరి వ్యక్తికి కూడా అదే నాణ్యతతో చేరాలి. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం సహించబడదు. ప్రజల ఆరోగ్యం, పిల్లల భవిష్యత్‌తో రాజీ పడే ప్రసక్తే లేదు," అని చెప్పారు. గోడౌన్ నిర్వహణలో పారదర్శకత, క్రమశిక్షణ తప్పనిసరిగా పాటించాలని, ఎక్కడైనా లోపాలు తేలితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రజా సంక్షేమ పథకాలు సక్రమంగా అమలయ్యేలా నిరంతర తనిఖీలు కొనసాగిస్తామని తెలిపారు.

## పొట్టి శ్రీరాములు త్యాగం యువతకు శాశ్వత స్ఫూర్తి

**- ఉయ్యాల ప్రవీణ్**




**నాయుడుపేట– సూర్య వాస్తవం, డిసెంబర్ 15:** అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా నాయుడు పేటలో ఘన నివాళుల కార్యక్రమం నిర్వహించారు. నాయుడుపేట ఏఎంసీ ఛైర్మన్, జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ స్థానిక జనసేన నాయకులతో కలిసి బస్టాండ్ వద్ద ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగు ప్రజల స్వాభిమానానికి ప్రతీకగా నిలిచిన మహానుభావుడు శ్రీ పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన చేసిన త్యాగం ఫలితంగానే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం సాధ్యమైందని తెలిపారు. నిరాహార దీక్ష ద్వారా దేశ రాజకీయ చరిత్రలో చెరగని ముద్ర వేసిన నాయకుడిగా శ్రీ పొట్టి శ్రీరాములు నిలిచారన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు జీవితం నేటి యువ తకు స్ఫూర్తిదాయకమని, ప్రజల కోసం త్యాగం చేయడమే నిజమైన దేశభక్తి అని ఆయన చాటిచెప్పారని ఉయ్యాల ప్రవీణ్ పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లుతూ రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జనసేన పార్టీ నాయకులు అట్ల కృష్ణారావు, బాలు శెట్టి, కుంపటి శ్రీనివాసులు, జ్యోతిష్‌తో పాటు వీర మహిళలు రోహిణి, సల్మా, హేమ తదితరులు పాల్గొన్నారు.


PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )